





సార్..! నేను రోజు మా ఊరి నుంచి ఎమ్మిగనూరుకు వచ్చి.. ఇక్కడి నుంచి పల్లెపల్లెకు వెళ్లి సిల్వరు, ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకొని జీవనం సాగిస్తున్నా. ప్రతి రోజూ రూ.150-200 వరకు చార్జీల కోసం ఖర్చు చేయాల్సి వచ్చేది. చంద్రన్న ఉచిత బస్సు ప్రయాణం వల్ల నాకు రోజుకు సగటున రూ.150 చొప్పున నెలకు రూ.4,500 చార్జీల రూపంలో ఆదా అవుతుంది. ఇక నుంచి ఆ డబ్బు కుటుంబ ఖర్చులకు వస్తుంది. చంద్రబాబు చల్లంగుండాలయ్యా..! అంటూ సి.బెళగల్ గ్రామానికి చెందిన సూరమ్మ సంతోషం వ్యక్తం చేశారు. ఆమె ఒక్కటే కాదు.. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సాగించిన ఏ మహిళను కదిపినా ఉచిత బస్సు ప్రయాణంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నారీలోకం.. హర్షాతిరేకం..!

- ఆర్టీసీ బస్సుల్లో మహిళల సందడి
- జీరో టికెట్లు అందిస్తున్న కండెక్టర్లు
- 'స్త్రీ శక్తి'ని సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు
- జిల్లాలో తొలి రోజు 15వేల మందికి పైగా ప్రయాణం
- చిన్నచిన్న సమస్యలున్నా 95 శాతం సక్సెస్

కర్నూలు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పేరిట సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణంపై మహిళాలోకం హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తుంది. ఆధార్, రేషన్‌కార్డు వంటి గుర్తింపు కార్డు చూపిస్తే.. కండక్టర్లు జీరో టికెట్ ఇస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే 'స్త్రీ శక్తి' పథకానికి సీఎం చంద్రబాబు శుక్రవారం సాయంత్రం శ్రీకారం చుట్టారు. జిల్లాలో మంత్రి టీజీ భరత్, ఆయా నియోజకవర్గాల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. శనివారం ఉదయం నుంచే మహిళలు పెద్దసంఖ్యలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కృష్ణాష్టమి సెలవు కావడంతో మహిళా ఉద్యోగుల సంఖ్య తగ్గింది. జిల్లాలో తొలిరోజు దాదాపుగా 15వేల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకుంటారని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణంపై 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పలువురు మహిళలను పలకరించింది. ఎవరిని కదిపినా ఒకటే మాట.. చంద్రన్నా.. నీవు చల్లంగా ఉండాలయ్యా..! అంటూ దీవిస్తున్నారు.

గుర్తింపు కార్డులు తప్పనిసరి



'స్త్రీ శక్తి'లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు 250 బస్సులు సిద్ధం చేశాం. అన్నిరకాల సర్వీసు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం ఉంటుంది. ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక గుర్తింపు కార్డును మహిళలు తప్పక చూపించాలి. ప్రభుత్వ మహిళా ఉద్యోగులు ఆ సంస్థ ఇచ్చే గుర్తింపు (ఐడీ) కార్డు, విభిన్న ప్రతిభావంతులైన మహిళలు సంబంధిత సంక్షేమ శాఖ ఇచ్చే గుర్తింపు కార్డు చూపించినా అనుమతి ఇస్తారు.

● టి శ్రీనివాసులు,
ఆర్టీసీ ఆర్ఎం, కర్నూలు

తొలి రోజు చిన్నపాటి ఇబ్బందులు

జిల్లాలో కర్నూలు, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, ఆలూరు, ఆదోని, మంత్రాలయం ఆర్టీసీ బస్టాండుల్లో ఉచిత బస్సు ప్రయాణం అమలు తీరును 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది. పలువురు మహిళలను పలకరించి అమలు తీరు ఎలా ఉందో అడిగి తెలుసుకుంది. తొలిరోజు కావడంతో టికెట్ల జారీ, గుర్తింపు కార్డులు చూపించడంలో చిన్నిచిన్న ఇబ్బందులు తలెత్తినా 95 శాతం సూపర్ సక్సెస్ అయ్యింది. మహిళలు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాలు, పట్టణాలకు వెళ్లి కూరగాయాలు, పాలు పెరుగు, దుస్తులు, వంట సామగ్రి.. వంటివి విక్రయిస్తూ జీవనం సాగించే చిరు వ్యాపారాలు చేసే మహిళల్లో రెట్టింపు ఆనందోత్సాహం కనిపించింది. రోజుకు రూ.100-200కు పైగా చార్జీల రూపంలో ఖర్చులు భరించాల్సి వచ్చేది. ఉచిత ప్రయాణం వల్ల నెలకు సరాసరి రూ.2,500 నుంచి రూ.4,500కు పైగా ఆదా అవుతుంది. ఉచిత బస్సు ప్రయాణం రూపంలో ఏడాదికి రూ.25-50వేలు వరకు కూటమి ప్రభుత్వం ఆర్థిక చేయూత అందించినట్లే అని కోడుమూరు మండలం పాలకుర్తి గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి రామలక్ష్మమ్మ పేర్కొన్నారు. మాది కర్నూలు.. గోనెగండ్ల మండలంలో ఓ గ్రామ సచివాలయంలో పని చేస్తున్నా. రోజు ఆర్టీసీ బస్సులో వెళ్లి రావడం వల్ల రానుపోనూ చార్జీలు రూ.150-200కు పైగా అవుతుంది. గోనెగండ్లలో స్టాప్ లేదంటే ఎమ్మిగనూరు చార్జీ తీసుకోవాల్సి వచ్చేంది. ఉచిత బస్సు ప్రయాణంతో ఎంత తక్కువ కాదన్న రూ.5వేల వరకు ఆదా అవుతుందని, 'స్త్రీశక్తి' మహిళా ఉద్యోగులకు ఓ వరమని సచివాలయ మహిళా ఉద్యోగి ఒకరు పేర్కొన్నారు. అన్ని వర్గాల మహిళలు ఉచిత బస్సు ప్రయాణంపై ఆనందోత్సాహం వ్యక్తం చేశారు.



నిబంధనలు సడలించి శ్రీశైలం ఘాట్ రూట్లో..

ఘాట్ రూట్లో ఉచిత బస్సు ప్రయాణం లేదనే నిబంధన మొదట్లో పెట్టారు. శ్రీశైలం వెళ్లే మహిళా భక్తులకు ఉచిత ప్రయాణ సౌకర్యం లేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు. స్త్రీశక్తి ప్రారంభోత్సవ సభలో మహిళా భక్తులు ఉచితంగా శ్రీశైలం వెళ్లి మల్లన్నను దర్శించుకొని రావొచ్చని సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీంతో నిబంధనలు సడలించి శ్రీశైలం ఘాట్ రూట్లో కూడా భద్రత దృష్ట్యా పరిమితి (సీటింగ్ కెపాసిటీ)కి మించకుండా వరకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించారు. దీంతో జిల్లాలో ఉచిత ప్రయాణం కల్పించే పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల 231నుంచి 250కి చేరాయి. స్పెషల్ బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణం కల్పిస్తారు. కృష్ణాష్టమి సెలవు రోజు కావడంతో తొలిరోజు స్వల్పంగా మహిళా ప్రయాణికుల సంఖ్య తగ్గినా, సరాసరి 15వేల మందికిపైగా ఉచిత ప్రయాణ సౌకర్యం సద్వినియోగం చేసుకున్నారని ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు తెలిపారు. ఉచిత ప్రయాణంపై మహిళలకు అవగాహన కల్పించారు. కర్నూలు నుంచి ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు వెళ్లే ప్రయాణికులు ముప్పాతిక శాతం ఉన్నారు. కర్నూలు-ఆదోని వయా కోడుమూరు, ఎమ్మిగనూరు మీదుగా నడిపే సింగిల్, టూ, త్రీ స్టాప్ బస్సుల్లో కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుండడంపై మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రాఘవేంద్ర స్వామి దర్శించుకున్నా



ప్రభుత్వం మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించటం మంచిదే. మొదటి సారి ఉచిత బస్సులో ప్రయాణించి పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నాం.

● సౌమ్య, ఆదోని

మహిళలకు దక్కిన గౌరవం



ప్రభుత్వం మహిళలకు గౌరవం కల్పించింది. ఉచిత బస్సు పథకం మహిళలకు ఎంతో ఉప యోగ పడుతుంది. ఏదైనా ఆసుపత్రికి వచ్చినా, కుటుంబ అవసరాలకై పట్టణానికి వచ్చినా కూడా ఉచితంగా రావడం అనేది చాలా ఆనందం వేస్తుంది. బస్సుకి ఇచ్చే చార్జీలకు అయ్యే ఖర్చు పిల్లలకు పండ్లు తీసుకెళ్లొచ్చు.

● సరస్వతి, గోనెగండ్ల

చంద్రబాబు మంచి పని..



ఆడోళ్లకు సీఎం చంద్రబాబు మంచి పని చేశారు. కొడుకులను దుడ్లు అడిగే పని లేదు. మాకేమి ఏదైనా అడ్రస్ కార్డు ఉంటే చాలు. బస్సు ఎక్కుతాము పోయి పని చూసుకుంటాం. మరి అదే బస్సుకు వస్తాం. నాకేం పించన్ కూడా వస్తుంది. వారికి నేనే ఇస్తాను. చంద్రబాబు మాట ఇచ్చాడు. దాని ప్రకారం నడుచుకున్నాడు. - జెరూసమ్మ, ఎమ్మిగనూరు

సెప్టెంబరు 22 నుంచి దసరా మహోత్సవాలు

- భక్తుల కోసం ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేయాలి
- సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేద్దాం
- శ్రీశైల ఆలయ ఈవో శ్రీనివాసరావు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో సెప్టెంబరు 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉత్సవాల నిర్వహణకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉభయ దేవాలయాల అర్చకులు, అధ్యాపక, వేదపండితులు, ఆలయ సిబ్బంది, పర్యవేక్షకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్వామి అమ్మవార్లకు జరిపించాల్సిన ఆయా కైంకర్యాలను, వాహనసేవలు, ఉత్సవమూర్తికి నవదుర్గ అలంకరణలు, నిజరూపాలంకరణ, రాజరాజేశ్వరి అలకంరణ, విజయదశిమి రోజున శమీపూజ, తెప్పోత్సవం, భక్తులకు



కల్పించాల్సిన సౌకర్యాలు, వాహనాల పార్కింగ్, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, దర్శనం ఏర్పాట్లు, భక్తులకు అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలపై చర్చించారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని విభాగాలు కూడా పరస్పర సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. భక్తులు ఉత్సవాలను వీక్షించేందుకు వీలుగా ఎల్ఈడీ స్ర్కీన్లను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. ఉత్సవాలకు సంబంధించి అధికారులకు తగు జాగ్రత్తలు తీసుకొని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు.

టీడీపీలో వర్గ విభేదాలు బహిర్గతం

- విజయోత్సవ ర్యాలీలో ఎవరికి వారే యమునా తీరు
- వేర్వేరుగా నియోజకవర్గ నాయకుల ర్యాలీ
- పూల నాగరాజు వ్యాఖ్యలపై గౌడ్ మండిపాటు
- అయోమయంలో పార్టీ శ్రేణులు



ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న వీరభద్రగౌడ్

ఆలూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల మధ్య మరోసారి వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. శనివారం పట్టణంలో 'అన్నదాత సుఖీభవ'పై నిర్వహించిన విజయోత్సవ ర్యాలీ పార్టీ నాయకుల మధ్య వివాదానికి తెర తీసింది. టీడీపీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పూల నాగరాజు ఆధ్వర్యంలో జరగాల్సిన ట్రాక్టర్ ర్యాలీలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరించారు. ప్రోగ్రామ్ షెడ్యూల్ మేరకు పట్టణ శివారులో ఉన్న హనుమాన్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించాలని ఎమ్మెల్సీ బీటీ నాయుడు, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, మహిళా నేత వైకుంఠం జ్యోతి వెయిట్ చేస్తున్నారు. టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ ఆయన వర్గం ట్రాక్టర్లతో ర్యాలీగా వచ్చారు. ముందుగా వైకుంఠం జ్యోతి జెండాలు కట్టిన ట్రాక్టర్లలో కూర్చొన్న వారు గౌడ్‌ను కూడా ట్రాక్టర్‌లోకి ఎక్కాలని ఆహ్వానించారు. వ్యక్తిగత జెండాలు ఉంటే తాను ఎక్కేదిలేదని జెండాలు తొలగించాలని వీరభద్రగౌడ్ కోరారు. బీటీ నాయుడు జెండాలు తొలగించాలని సూచించడంతో జెండాలు తీసేసి ట్రాక్టర్‌పైకి ఎక్కించారు. గౌడ్ వర్గీయులు అందుకు ఒప్పుకోక పోవడంతో గౌడ్ కిందకు దిగి తన వర్గం వారు తెచ్చిన ట్రాక్టర్‌లో ఎక్కి ర్యాలీ చేపట్టారు. దీంతో ఇరువురు వేరే ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తుండగా తమ ర్యాలీని నిలిపివేసి మా డీజేను ఎలా వాడుకుంటారని పోలీసులతో గౌడ్ వర్గీయులు వాగ్వాదం చేశారు. ఇక గొడవలకి దారి తీస్తుందని తెలుసుకున్న సీఐ రవిశంకర్‌రెడ్డి పరిశీలకులు పూల నాగరాజు, టీడీపీ నాయకురాలు వైకుంఠం జ్యోతి ఉన్న ట్రాక్టర్‌ను ముందుగా తరలించారు. వీరభద్రగౌడ్ లేకుండానే స్థానిక అంబేడ్కర్ కూడలిలో ట్రాక్టర్ ర్యాలీ చేపట్టి ప్రసంగించారు. పార్టీలో ఎలాంటి వర్గ విబేధాలు లేవని పార్టీ పరిశీలకులు పూల నాగరాజు ప్రకటించారు. వీరభద్రగౌడ్ ఇన్‌చార్జి కాదని, ఆయన పార్టీలో సీనియర్ నాయకుడు మాత్రమే అని వెల్లడించారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేసిన తర్వాత వీరభద్రగౌడ్ తన అనుచర వర్గంతో కలిసి ట్రాక్టర్లతో ర్యాలీగా వచ్చి అంబేడ్కర్ కూడలిలో సమావేశం నిర్వహించారు. తాను ఇన్‌చార్జి కాదని ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఒకే వర్గానికి మద్దతు ఇవ్వడం సరికాదన్నారు. తమ కార్యకర్తలపై వేధింపులకు గురిచేస్తే ఇక సహించబోనని, అభ్యంతరం తెలిపే అధికారులపై కలెక్టర్, ఎస్పీ, డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. టీడీపీ నాయకులు కామినహాల్ రమేష్, కిష్టప్ప, మిక్కిలినేని ప్రసాద్, మీనాక్షినాయుడు, కురువ జయరాం, అశోక్, రఘు ప్రసాద్‌రెడ్డి, అట్టేకల్ బాబు, శేషగిరి, విష్ణు, తిమ్మయ్య, రామచంద్రనాయుడు, సుభాన్, ఉచ్చీరప్ప, పాల్‌రెడ్డి, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.



ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ పరిశీలకులు పూల నాగరాజు, టీడీపీ నాయకురాలు వైకుంఠం జ్యోతి, బొజ్జమ్మ

ముకుందా.. ముకుందా...

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- కృష్ణ, గోపిక వేషధారణలో చిన్నారులు



కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీలో కృష్ణుడితో గోపికలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా సాగాయి. ఉట్టికొట్టి చిన్నాపెద్ద సందడి చేశారు. పలుచోట్ల చిన్నారులు.. గోపాలుడు, గోపికమ్మల వేషధారణలతో ఆకట్టుకున్నారు. కర్నూలు నగరంలోని ఇస్కాన్ మందిరం భక్తులతో కిటకిటలాడింది. ప్రపంచానికి గీతను బోధించి, ప్రేమతత్వాన్ని పంచిన శ్రీకృష్ణుడి కృపాకటాక్షాలు ఉండేలా ప్రత్యేక పూజలు చేశారు. కర్నూలు నగరంలోని నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని శ్రీకృష్ణ మందిరంలో, నగరంలో కిడ్స్ వరల్డ్ సమీపంలోని గో సంరక్షణశాలలో, ఇస్కాన్ (అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం) మందిరం ఆధ్వర్యంలో నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దేవి ఫంక్షన్ హాలులో, బి.క్యాంపులోని విజ్ఞాన మందిరం, గోదా గోకుల క్షేత్రంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని రుక్మిణీ సమేత శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. యాదవ కుల బంధువుల ఆధ్వర్యంలో, శ్రీకృష్ణ జయంతి ఉత్సవ కమిటీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలు వైభవంగా నిర్వహించారు. నగరంలో కలెక్టరేట్ నుంచి శ్రీకృష్ణ మందిరం వరకు శ్రీకృష్ణ భగవానుడి విగ్రహంతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో శనివారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దేవి ఫంక్షన్ హాలులో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక పోటీలు ఏర్పాటు చేశారు. గో సంరక్షణ శాలలో ఉదయం శ్రీకృష్ణ విగ్రహానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.





శ్రీకృష్ణుని విగ్రహాన్ని రథంలో ఊరేగిస్తున్న యాదవులు



ఆదోనిలో ఊరేగింపు

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్, మండల కేంద్రాల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమస్యకు పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవాలంటే కాల్ సెంటర్ 1100కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

సుంకేసుల గేట్ల మరమ్మతులను పరిశీలించిన ఎస్ఈ 6



తుంగభద్ర తీరం

సాహిత్యం

వైష్ణవాలయాల విశిష్టతను తెలిపే
ఆళ్వారుల చరిత్ర-ప్రబంధము



కర్నూలు కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగు సాహిత్యంలో సంక్షిప్తను కోరుకునే పాఠకులకు అనుగుణంగా మినీ కవిత, హైకూలు, నానీలు తదితర సంక్షిప్త రచనలే విస్తృతంగా కనిపిస్తుంటాయి. కానీ అందుకు భిన్నంగా, జిల్లాకు చెందిన డాక్టర్ వైష్ణవ వెంకట రమణమూర్తి ఆళ్వారుల చరిత్ర పేరుతో 300 పేజీల ప్రబంధ కావ్యాన్ని పుస్తక ప్రియుల ముందుకు తీసుకువచ్చారు. పద్య కవిత్వం ఒక పాయగా సాహిత్యంలో సాగుతూ ఈ మధ్యకాలంలో శతకాల రూపంలో సంఖ్యాపరంగా విస్తృతి సాధించింది. కానీ ప్రబంధ కావ్యాలు మాత్రం అరుదై పోయాయి. అందుకు శ్రీకారం చుడుతూ 2021లో ప్రథమ ముద్రణ పొందిన ఈ కావ్యంలో అనేక విశిష్టతలు ఉన్నాయి. పన్నెండు మంది ఆళ్వారుల చరిత్రలను కావ్య రూపంలో చెప్పడం, 33 రకాల ఛందస్సులను ఉపయోగించి పద్య రచన చేయడం, 1,054 పద్యాలతో విలసిల్లే ఈ ప్రబంధంలో ప్రామాణిక గ్రంథాలను అధ్యయనం చేసి, చరిత్రను అవలోకనం చేసి ఏ రకమైన కల్పిత ఇతివృత్తాలు లేకుండా ఆళ్వారుల చరిత్ర చెప్పారు రచయిత. పాశురాలను, స్తోత్రాలను అనువదించి పాఠకులకు అందించారు. రచయిత చిరు పరిశోధన అంటే ఎంఫిల్ ఎంఫిల్ నామదేవ, జ్ఞానదేవ, ఘోరాకుంబార్, కబీరు, జయదేవుడు మొదలైన శ్రీపాండురంగ, శ్రీరామ, శ్రీకృష్ణ భక్తుల ఇతివృత్తాలు గల నిర్వచన మహాభక్త విజయముపై జరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వైష్ణవాలయాల ఉనికితో పాటు క్షేత్ర సాహిత్య చరిత్ర రాసి, 'తెలుగు సాహిత్యము కర్నూలు జిల్లాలో వైష్ణవాలయాల ప్రాశస్త్యము' పరిశోధనాంశంగా పీహెచ్‌డీ చేశారు.

ప్రబంధాలలో ఉండే కథ, కథన వైచిత్రి, పద ప్రయోగ ఔచిత్యము, రసాలంకార నిర్వహణ ఈ కావ్యంలో పుష్కలంగా ఉన్నాయి. 5 ఆశ్వాసాలు ఉన్న ఈ ప్రబంధంలో ఐదో అశ్వాసాన్ని కృష్ణాష్టమి విశిష్టాద్వైత స్థాపకులైన రామానుజాచార్యుల వారి చరిత్రను చెప్పడానికి కేటాయించారు. అధికమాసంతో కలిసి 124 ఏళ్ల జీవించిన రామానుజాచార్యుల వారి చరిత్రను 124 పద్యాలతోనే రాయడం విశేషం. అష్టాక్షరీ మంత్రాన్ని రామానుజాచార్యులు అందరికీ చెప్పే సందర్భాన్ని, ఆ తర్వాత రామానుజుల అంతరంగాన్ని తేట తెలుగులో చెప్పారు రచయిత. వైష్ణవులకు అతి ముఖ్యమైన 108 దివ్య దేశాల క్షేత్ర మహాత్మ్యాన్ని వర్ణించిన తీరు అద్భుతంగా సాగుతుంది.



- దేనెపూడి నరేష్ బాబు,
పుస్తక సమీక్షకులు, నంద్యాల



నాటకమే జీవితం



'నాటకం, సినీ రంగాలు నాకు శ్వాస నిశ్వాసల్లాంటివి. మొదటిది ఉనికి, ఉన్నతిని ఇస్తే, రెండోది దాన్ని నలుదిశలా చాటుకునేలా చేస్తోంది' అంటున్నారు తిరుపతికి చెందిన రంగస్థల, సినీ, టీవీ నటీమణి డాక్టర్ డి.హసీనా జాన్. ఇంటర్ చదువుతున్నప్పుడే నాట్యం, నటన నేర్చుకొని రంగస్థలంపై అరంగేట్రం చేసిన ఆమె నటనకు హోసూరులోని ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. రాయలసీమ నుంచి నటనలో గౌరవ డాక్టరేట్ పొందిన తొలి నటీమణి కావడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు వెయ్యికి పైగా ప్రదర్శనలిచ్చిన ఆమె పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాల్లో తనదైన నటనాభివేషాలతో రాణిస్తున్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమెతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడింది. - కర్నూలు కల్చరల్ (ఆంధ్రజ్యోతి)



- పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాల్లో రాణిస్తున్న హసీనా
- వెయ్యికి పైగా నాటక ప్రదర్శనలు
- మూడేళ్లకే తల్లిదండ్రులు దూరం
- రాయలసీమ వ్యాప్తంగా ప్రదర్శనలు



హసీనాను సత్కరిస్తున్న మంత్రి టీజీ భరత్

భర్త, పిల్లల ప్రోత్సాహంతో...

2007లో నాయుడుపేటకు లతీఫ్ అబ్దుల్ కరీంతో డాక్టర్ హసీనా జాన్‌కు వివాహం జరిగింది. సంప్రదాయ ముస్లిం కుటుంబంలో పుట్టి నాటకాలపై ఆసక్తితో రాణిస్తున్న ఆమెకు భర్త నుంచి ప్రోత్సాహం లభించింది. దీంతో ఆమె మరింత ఉత్సాహంతో నాటకం, సినీ రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు దూసుకుపోయింది. ప్రస్తుతం పిల్లలు షేక్ కాలేషా వలి పదో తరగతి, కుమార్తె జుల్ఫేకర్ ఫాతిమా ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. భర్త, పిల్లల సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలకు అవకాశం కలుగుతోందని హసీనా జాన్ తెలిపారు.

మూడేళ్లకే తల్లిదండ్రులను కోల్పోయి...

తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన డి.హసీనా జాన్ 1977 సెప్టెంబరు 1న జంషెడ్‌పూర్ (టాటానగర్)లో జన్మించారు. తల్లిదండ్రులు మెమోలా జాన్, షేక్ ఖాదర్‌వలీ బాషా ఇద్దరూ టాటానగర్‌లో ఉద్యోగాలు చేసేవారు. వెంకటగిరిలో జన్మించిన ఆమె తల్లి మెమోలా జాన్ వృత్తిరీత్యా వైద్యురాలిగా ఉంటూ, ఉన్నత విద్యకై టాటానగర్ వెళ్లారు. అక్కడ షేక్ ఖాదర్‌వలీ బాషాతో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారి వారి వివాహానికి దారితీసింది. దీంతో హసీనా జాన్ వారికి ఏకైక సంతానంగా అక్కడే జన్మించారు. ఎంతో అన్యోన్యంగా, సుఖ సంతోషాలతో సాగిపోతున్న వారి జీవితాలను విధి రక్కసి కాటేసింది. ఒక రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు ఇద్దరు మరణించగా, ప్రాణాపాయ స్థితిలో బతికి బయటపడ్డ మూడేళ్ల హసీనా జాన్‌కు వెంకటగిరిలో ఉంటున్న అమ్మమ్మ షేక్ హమీదా బీ, తాతయ్య షేక్ ఖాలేషా దిక్కయ్యారు. వారే హసీనాను చేరదీసి విద్యాబుద్ధులు చెప్పించారు. తాతయ్య వృత్తిరీత్యా రైల్వే ఉద్యోగి కావడంతో కుటుంబాన్ని వెంకటగిరిలోనే పెట్టి వృత్తిపరంగా వివిధ ప్రాంతాల్లో ఆయన పనిచేసేవారు. వెంకటగిరిలో పది పూర్తిచేసిన హసీనా ఇంటర్ విద్యకు తిరుపతి పద్మావతి జూనియర్ కళాశాల్లో చేరింది. అక్కడే భరతనాట్యం నేర్చుకుంది. అక్కడే కళాశాల స్థాయిలో నాటకాలు వేయడం ప్రారంభించింది. అమ్మమ్మ మెమోలా జాన్‌కు కళల పట్ల ఆసక్తి ఉండటంతో నాటక, నృత్య రంగాల్లో బాగా ప్రోత్సహించింది. అలా తిరుపతిలో 'పృథ్వీ-సంయుక్త' చారిత్రక నాటకం, 'ఓలి' సాంఘిక నాటకం, 'అన్నమయ్య' పౌరాణిక నాటకాలలో తొలిసారిగా పాత్రల్లో మెప్పించింది. దీంతో ఇక ఆమె వెనుదిరిగి చూసుకోలేదు.

అవార్డులు..రివార్డులు ఆమె సొంతం

తమిళనాడులోని హోసూరులోని ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ 2025 ఏప్రిల్ 2న హసీనా జాన్‌కు 'గౌరవ డాక్టరేట్'ను ప్రదానం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నాటక రంగంలో విభిన్న పాత్రలతో రాణిస్తున్న ఆమెను గురించి ఈ డాక్టరేట్ డిగ్రీని ఆమెకు అందజేశారు. అలాగే 2015లో ఆమెకు పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం ఏలూరులో 'కందుకూరి' విశిష్ట పురస్కారం అందజేశారు. 2025 మార్చి 16న హైదరాబాదులోని సర్ సీవీ రామన్ అకాడమీ 'రంగస్థల మహిళారత్న' పురస్కారం ప్రదానం చేశారు. అలాగే ఆమె నంటించిన బభ్రువాహన విజయం, శ్రీకృష్ణ కమలపాలిక, శ్రీకృష్ణార్జున యుద్ధం, సై సైరా నరసింహారెడ్డి తదితర నాటకాలకు నంది అవార్డులు లభించాయి. తిరుపతిలోని అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఆమెకు ఉచిత హాస్యనటి అవార్డుతో సత్కరించారు.



చంద్రబాబు నుంచి అవార్డును స్వీకరిస్తున్న బృందంలో హసీనా

3 దశాబ్దాలుగా నాటకరంగంలోనే...

గత 30 ఏళ్లుగా నాటక రంగంలో అనేక పాత్రలు పోషించి మెప్పించిన డాక్టర్ హసీనా జాన్‌ను తిరుపతిలోని నాటక దర్శకుడు ప్రకాశ్ రాజ్, సుందర్ బాబు, కేఎస్ రాజా, పల్లేటి లక్ష్మీకులశేఖర్, భరద్వాజ్, టీడీపీ మాజీ ఎంపీ దివంగత శివప్రసాద్‌లతో పాటు కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య ప్రోత్సాహకాలు అందించారు. వివిధ నాటకాల్లో హసీనాకు మంచి పాత్రలు ఇచ్చి ఆమె ఎదుగుదలకు కృషి చేశారు. సినిమా రంగంలోనూ హసీనాజాన్‌కు అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. ప్రముఖ నటుడు మోహన్‌బాబు నిర్మించిన 'గాయత్రి' వెబ్ సిరీస్‌తోపాటూ బీఎన్ రెడ్డి తీసిన 'నీతోనే హాయ్ హాయ్', టీవీ సీరియళ్లు తలంబ్రాలు, జయం, నిన్నే పెళ్లాడతా, కల్యాణి తదితర వాటిల్లో ముఖ్య భూమికలు పోషించారు.

కళాకారులను ప్రత్యేకంగా గుర్తించాలి

రాష్ట్ర ప్రభుత్వం రంగస్థల కళాకారులను ప్రత్యేకంగా గుర్తించాలి. గుర్తింపు కార్డులు జారీ చేసి బస్సులు, రైళ్లలో ప్రత్యేక రాయితీలు కల్పించాలి. నిత్యం వివిధ ప్రాంతాలకు నటించేందుకు వెళ్లే వారికి ఇది కొంత ఆర్థిక భారం తగ్గినట్లు అవుతుంది. అలాగే జిల్లా కేంద్రాల్లో కళాకారులకు ప్రత్యేక కాలనీలు నిర్మించాలి. వృద్ధ కళాకారులకు పింఛన్లు కూడా పెంచి ఇవ్వడంతో పాటు వివిధ ప్రైవేటు, కార్పొరేట్ వైద్యాశాలల్లో చికిత్సలకు రాయితీలు కల్పించాలి. పాఠశాలలు, కళాశాలల్లో నాటకం, నటన అంశాలపై ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి, యువతకు కళారంగంలో శిక్షణ కల్పించాలి. - హసీనా జాన్

శ్రీశైల భ్రమరాంబ దేవికి బంగారు హారం



తుగ్గలి నాగేంద్ర దంపతులను సత్కరిస్తున్న ఆలయ ఈవో




బంగారు హారం

నంద్యాల కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైలంలోని భ్రమరాంబదేవికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, వరలక్ష్మి దంపతులు రూ.11 లక్షల విలువైన కాసులపేర (బంగారునగ)ను సమర్పించారు. ముందు గా దాతకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా 100 గ్రాముల బరువున్న కాసుల పేరను ఆలయ ఈఓ శ్రీనివాసరావుకు అందజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకున్న దాతలను ఆలయ వేదాశీర్వచన మండపంలో ఈఓతో పాటు వేదపండితులు గంటి రాధకృష్ణమూర్తి, ఆలయ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున స్వామివారి జ్ఞాపిక, అమ్మవార్ల శేష వస్త్రాలను ఇచ్చి సత్కరించారు.

బొమ్మ పోయింది.. రాజముద్ర వచ్చింది

- రీసర్వే గ్రామాలకు 2,287 పాసు పుస్తకాలు



నేడు రాజముద్రతో ఉన్న పాసు పుస్తకం



నాడు జగన్ బొమ్మతో ఉన్న పాసు పుస్తకం

మద్దికెర ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భూమి రైతుది.. దాని పట్టాదారు పాసు పుస్తకమూ రైతుదే.. కానీ దానిపై ఫోటో మాత్రం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది.. దీంతో తమ పాసు పుస్తకంపై జగన్ బొమ్మ ముద్రించడం ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్త చేశారు. జగన్ బొమ్మతో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ముద్రించి రైతులకు అందించారు. పాసు పుస్తకం చూసిన ప్పుడల్లా రైతులు ఆగ్రహించేవారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో వైఎస్ జగన్ బొమ్మ పోయి రాజముద్రతో ఉన్న పాసు పుస్తకాలు వస్తున్నాయి. మండలంలోని హంపా, బొమ్మనపల్లి, కొత్తపల్లి, బసినేపల్లి, మదనంతపురం గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయింది. అప్పట్లో భూమి వివరాలతో కూడిన పాసు పుస్తకాలు ఇచ్చారు. దీనిపై రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో అప్పటి ప్రభుత్వం కొద్దిరోజుల పాటు నిలిపివేసింది. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాసు పుస్తకాలపైన ఎటువంటి బొమ్మలు ప్రచురించలేదు. పాసు పుస్తకాలపై గౌరవప్రదంగా రాజముద్ర వేయించి రెవెన్యూ కార్యాలయానికి పంపారు. రీసర్వే చేసిన హంపా, బొమ్మనపల్లి, కొత్తపల్లి, బసినేపల్లి, మదనంతపురం గ్రామాలకు 2,287 పాసు పుస్తకాలు వచ్చాయని తహసీల్దార్ గూండాల్ నాయక్ తెలిపారు. ప్రస్తుతం బురుజుల, పెరవలి, ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన పాసు పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. రాజముద్రతో ఉన్న పాసు పుస్తకాలను పంపిణీ చేస్తుండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జశ్వంత్ జైత్రయాత్ర

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అంకితభావం, కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చనే దానికి నిదర్శనం యువ క్రీడాకారుడు జశ్వంత్. నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచాడు. జశ్వంత్ విజయం క్రీడాకారులందరికీ ఆదర్శం. జాతీయ బ్యాడ్మింటన్‌లో నంద్యాలకి చెందిన మహంకాళి జశ్వంత్ జైత్రయాత్ర కొనసాగిస్తున్నాడు. అఖిలభారత ర్యాంకింగ్ టోర్నీలో బంగారు పతకం కైవసం చేసుకొని అండర్-13 బాలుర విభాగంలో నెంబర్1 ర్యాంక్‌ను సాధించి నంద్యాల కీర్తిపతాకాన్ని ఎగురవేశాడు.

నంది పైప్స్ బ్యాడ్మింటన్ అకాడమిలో..

పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన రాజీవ్, గౌతమిల కుమారుడు జశ్వంత్ బ్యాడ్మింటన్‌పై ఇష్టంతో ఏడేళ్ల వయసు నుంచే రాకెట్ పట్టుకొని నందిపైప్స్ బాడ్మింటన్ అకాడమిలో సాధన చేశాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ నాగార్జున శిక్షణలో అతడు జాతీయ స్థాయిలో నెంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. చిన్నప్పటి నుంచి కఠోర సాధన చేసి మెలకువలు నేర్చుకొని ప్రస్తుతం అండర్-13 సింగిల్స్ విభాగంలో ఎదురులేని క్రీడాకారుడిగా అందరి మన్ననలు పొందుతున్నాడు.

కఠోర శిక్షణకు ఫలితంగా..

2023లో కోల్‌కతాలో జరిగిన అండర్-13 జాతీయస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించడంతో బెంగళూరులోని ప్రకాష్‌పదుకొనె బాడ్మింటన్ అకాడమిలో శిక్షణ పొందేందుకు అర్హత సాధించాడు. అక్కడ చేసిన కఠోర శిక్షణకు ఫలితంగా ప్రస్తుతం జాతీయ స్థాయిలో నెంబర్1 స్థానానికి ఎదిగాడు. ఇప్పటివరకు ఆరుసార్లు జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పతకాలు సాధించాడు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో సింగిల్స్, డబుల్స్‌లో బంగారు పతకాలు సాధించి అందరి దృష్టిలో పడ్డాడు.

ఉత్కంఠ భరితంగా సాగి ఫైనల్ పోటీలో ..

కోల్‌కతాలో ఈ నెల 9నుంచి 14వ తేదీ వరకు జరిగిన ఆలిండియా సబ్ జూనియర్ జాతీయ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో జశ్వంత్ అండర్-13విభాగంలో అద్భుతంగా ఆడి స్వర్ణపతకం సాధించాడు. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోటీలో హర్యానా రాష్ట్రానికి చెందిన రెండవ ర్యాంకర్ స్లోక్ చౌదరి రాయ్‌పై 19-21, 21-19, 21-16స్కోర్ తేడాతో జశ్వంత్ గెలుపొందాడు. అతడికి బంగారు పతకం, ట్రోఫీతోపాటు రూ.72వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. జశ్వంత్ విజయంపై ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ద్వారకనాథ్, కార్యదర్శి అంకమ్మ చౌదరి, జిల్లా కార్యదర్శి వంశీధర్, నంది బ్యాడ్మింటన్ శిక్షకుడు నాగార్జున ప్రత్యేకంగా అభినందించారు.



ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో ఆడుతున్న జశ్వంత్ (ఫైల్)

- బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న యువ క్రీడాకారుడు
- ఆలిండియాలో అండర్-13లో మొదటి ర్యాంక్
- ఏడేళ్ల వయస్సుకే రాకెట్ పట్టి సాధన
- కోచ్ నాగార్జున శిక్షణలో మెలకువలు
- తల్లిదండ్రుల ప్రోత్సాహం
- ఆరుసార్లు జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పతకాలు
- అభినందించిన ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు



సాధించిన కప్పు, మెడల్‌తో జశ్వంత్ (ఫైల్)


సంతోషంగా ఉంది

జాతీయ స్థాయిలో నెంబర్ 1 ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉంది. నందిపైప్స్ బాడ్మింటన్ అకాడమి ప్రోత్సాహంతో ఈస్థాయికి ఎదిగాను. కోచ్ నాగార్జున, బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి వంశీధర్ ప్రోత్సాహంతో బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నా. భవిష్యత్తులో బాడ్మింటన్‌లో మరింత నైపుణ్యం సాధించి అంతర్జాతీయ పోటీలకు వెళ్తా.
- జశ్వంత్, క్రీడాకారుడు



కోల్‌కత్తాలో బంగారు పతకం, నగదు పురస్కారం అందుకుంటున్న జశ్వంత్

సుంకేసుల గేట్ల మరమ్మతులను పరిశీలించిన ఎస్ఈ



సుంకేసుల బ్యారేజీ వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ బాలచంద్రారెడ్డి, కేసీ కెనాల్ డీఈఈ ప్రసాద్‌రావు తదితరులు

కర్నూలు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సుంకేసుల బ్యారేజీ గేట్ల మరమ్మతు పనులను జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, కేసీ కెనాల్ డీఈఈ ప్రసాద్‌రావు, ఏఈఈ మహేంద్రనాథ్‌లు శనివారం పరిశీలించారు. బ్యారేజీ సామర్థ్యం 1.20 టీఎంసీలు. ఎగువ తుంగభద్ర జలాశయం నుంచి 34 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. ఏడు గేట్లు ఒక మీటరు చొప్పున ఎత్తి 30,653 క్యూసెక్కులు దిగువన శ్రీశైలం డ్యాంకు విడుదల చేస్తున్నారు. ఆయకట్టు సాగు, కర్నూలు నగర తాగునీటి అవసరాల కోసం కేసీ కాలువకు 2,180 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. డ్యాం నిర్వహణ నిధులు రూ.30 లక్షలతో గేట్ల మరమ్మతులు చేస్తున్నారు. తుంగభద్ర డ్యాం నుంచి 50వేల క్యూసెక్కులు వరద విడుదల చేసే అవకాశం ఉండడంతో గేట్ల తాజా పరిస్థితిని ఎస్ఈ, డీఈఈలు పరిశీలించారు. వరదను అంచనా వేశారు. తక్షణమే గేట్లు మరమ్మతులు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద

కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల జీవనాడి తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతోంది. ఎగువ నుంచి 28,721 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. డ్యాం గరిష్ట నీటి మట్టం 1633 అడుగులు, పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు గాకా.. నిపుణుల సూచన మేరకు 1625.06 అడుగుల్లో 80 టీఎంసీలు నిల్వ చేసి వచ్చిన వరదను 22,190 క్యూసెక్కులు దిగువ నదికి, 6,531 క్యూసెక్కులు వివిధ కాలువలకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి వరద పెరుగుతోందని, ఆది వారం ఉదయానికి 50వేల క్యూసెక్కులు చేరే అవకాశం ఉందని తుంగభద్ర బోర్డు ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు



మాట్లాడుతున్న డోన్ డీఎస్పీ శ్రీనివాస్

బనగానపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఓ బాలిక గర్భందాల్చి మగ శిశువుకు జన్మనివ్వడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథ్‌రెడ్డి, నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం డోన్ డీఎస్పీ శ్రీనివాస్ నందివర్గం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఓ గ్రామంలో పదో తరగతి చదువుతున్న 17 సంవత్సరాల వయస్సుగల ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారం చేశాడన్నారు. ఆ బాలికకు కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా డాక్టర్లు పరీక్షలు నిర్వహించి ఆ బాలిక గర్భందాల్చినట్లు గుర్తించారన్నారు. ఆ బాలిక ఓ మగ శిశువుకు జన్మనిచ్చిందన్నారు. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బాధితురాలి గ్రామానికి వెళ్లి పూర్తి స్థాయిలో విచారించామన్నారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

- కంది పంటను దున్నేసిన ఓ వ్యక్తి
- పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు



నన్నూరులో దున్నేసిన కంది పంట

ఓర్వకల్లు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సుమారు 70 ఏళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నాం.. హక్కు పత్రాల కోసం ఎంతో కాలంగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. ప్రస్తుతం ఓ వ్యక్తి మేము సాగు చేసిన కంది పంటను ట్రాక్టర్‌తో దున్నేశాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని శనివారం పోలీసులను ఆశ్రయించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలం లోని నన్నూరు గ్రామ సర్వే నెంబరు 1292లో 22.32 సెంట్లు, అదే సర్వే నెంబరులో 7.50 ఎకరాల్లో గ్రామానికి చెందిన అగుట లక్ష్మీదేవి, అగుట శంకరమ్మ, బొల్లవరం బాలమ్మ దాదాపు 70 సంవత్సరాల నుంచి పంటలు సాగు చేసు కుంటున్నట్లు వారు తెలిపారు. సాగు ధ్రువీకరణ పత్రాల కోసం అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇతరులకు తప్పుడు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం ఇచ్చారని లక్ష్మీదేవి, శంకరమ్మ, బాలమ్మ ఆరోపించారు. తమ భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని, రికార్డులు మార్చాలని రెవెన్యూ అధికా రులకు ఎన్నిసార్లు విన్నవించానా పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో బనగానపల్లెకు చెందిన ఓ వ్యక్తి తమ భూమిని తాను కొనుగోలు చేశానంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం తమ పొలంలో సాగు చేసిన కంది పంటను ట్రాక్టర్లతో దౌర్జన్యంగా దున్నేశాడన్నారు. ఈ విషయంపై బాధిత రైతులు ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సునీల్ కుమార్‌ను వివరణ కోరగా బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, తహసీల్దార్‌తో చర్చించి రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ఉయ్యాలవాడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుడుమలదిన్నె గ్రామానికి చెందిన వేములపాటి మహేశ్వరి(29) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రామిరెడ్డి శనివారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... మహేశ్వరి కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతూ ఉదయం ఇంటి వద్ద ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి అంకాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ఆరు నెలల కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉరేసుకుని వృద్ధుడి..

మిడుతూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రోళ్లపాడు అభయారణ్యంలో ఓ వృద్ధుడు వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. నందికొట్కూరు మండలం బొల్లవరం గ్రామానికి చెందిన నాగేశ్వర రెడ్డి(79) శుక్రవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం రోళ్లపాడు అభయారణ్యంలోని ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో నాగేశ్వర రెడ్డి వేపచెట్టుకు తాడుతో ఉరివేసుకున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా మృతుడు నరాలబలహీనతతో బాధపడేవాడని, వ్యాధి తీవ్రత ఎక్కువకావడంతో భరించలేక మృతి చెందినట్లు మృతుడి కుమారుడు రామ్మోహన్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.

తప్పుడు కేసులతో భయపెట్టలేరు

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



సబ్‌జైలు ఎదుట ఎమ్మెల్యే అఖిల ప్రియ

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తప్పుడు కేసులతో భయపెట్టలేరని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తమపై, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వారికి లొంగిపోవాలని ఒత్తిడి చేశారని, అయినా భయపడలేదన్నారు. కార్యకర్తల పోరాటం ఫలితంగా మళ్లీ ఎన్నికల్లో గెలిచామమన్నారు. శనివారం కర్నూలు నగరంలోని మహిళా సబ్‌జైలును ఆమె సందర్శించారు. అక్కడ రక్షిత మంచినీటి ప్లాంటు, రెండు టీవీలను ఉచితంగా అందజేశారు. ఉప కారాగారం పరిసరాల్లో సీసీ రహదారి కోసం విన్నవించారని, దాన్ని కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గతంలో తనను అక్రమంగా అరెస్టు చేసినప్పుడు కూడా ఇదే కారాగారంలో ఉంచారని, ఇక్కడి సమస్యలు, పరిస్థితులు, అవసరాలను గుర్తించి వారికి సాయం చేశానని గుర్తు చేశారు. తప్పుడు కేసుల మూలంగా తాను సంవత్సరం బిడ్డను ఇంటి వద్ద వదిలి ఎంతో మానసిక క్షోభను అనుభవించానన్నారు. ఈ విషయం ఎన్నటికీ మర్చిపోనన్నారు. అధికారంలో ఉన్నా గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడ్డవారు ఎవరూ వాటిని విస్మరించరాదని, అక్రమార్కులపై పోరాటాన్ని అలాగే కొనసాగించాలని పిలుపునిచ్చారు. వైసీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి రీల్స్ రాజకీయాలకు సరిపోతాడే తప్ప, రియల్ రాజకీయాలకు పనికిరారన్నారు. ఆయన మాటకారితనం, ప్రత్యేక యాసతో మాట్లాడటమే రాజకీయమని భ్రమ పడుతున్నారని అఖిలప్రియ ఎద్దేవా చేశారు. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగాయి కాబట్టే ప్రతిపక్ష పార్టీ నామినేషను వేసిందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా బయటికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు కాబట్టే పులివెందులలో ప్రతిపక్ష పార్టీకి డిపాజిట్ గల్లంతైందని అఖిలప్రియ అన్నారు. ఈ కార్యక్రమాలో టీడీపీ నాయకుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రాలకు మంగళం..!

వైసీపీ అధికారంలోకి వచ్చేంతవరకు ఓ వెలుగు వెలిగి ప్రజలకు సుదీర్ఘ కాలం సేవలందించిన మీ సేవ కేంద్రాల మాట ఇక మర్చిపో వాల్సిందే. జగన్ హయాంలో సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో వీటికి చెక్ పడింది. ఫలితంగా మీసేవ కేంద్రాల నిర్వాహకుల పరిస్థితి అగమ్యగోచరగా మారనుంది. సుమారు పది వేల కుటుంబాలు రోడ్డున పడనున్నాయి.



సీఎం, డిప్యూటి సీఎం, లోకేశ్‌కు అభినందనలు తెలుపుతున్న నిర్వాహకులు(ఫైల్)

- జగన్ సచివాలయ వ్యవస్థతో కుదేలు
- కూటమి వాట్సప్ గవర్నెన్స్‌తో ఆందోళన
- అమలుకు నోచుకోని ఐటీ మంత్రి లోకేశ్ హామీ
- రోడ్డున పడనున్న 10వేల కుటుంబాలు

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సేవలందించిన మీ సేవ కేంద్రాలకు మంగళం పలకడంతో వాటి నిర్వాహకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరకపోవడంతో మీ సేవ కేంద్రాల నిర్వాహకులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో మీ సేవల నడ్డివిరిచారు. ప్రస్తుతం అధికారంలోకి రాగానే మీ సేవాకేంద్రాలను ఆదుకుంటామని యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ప్రకటించారు. అందుకనుగుణంగానే అసెంబ్లీలో ప్రస్తావించినప్పటికీ అమలుకు నోచుకోక పోవడంపట్ల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చేంతవరకు ఓ వెలుగు వెలిగిన మీ సేవా కేంద్రాలకు జగన్ చెక్ పెట్టాడు. మీ సేవ అందించే సర్వీసులన్నీ సచివాలయాల ద్వారా ఉచితంగా అందజేస్తామని చెప్పి తర్వాత రుసుం వసూలు ప్రారంభించారు. మీ సేవ కేంద్రాల ద్వారా తీసుకున్న సర్టిఫికెట్లు చెల్లవంటూ అప్పట్లో వలంటీర్లు, సచివాలయాల సిబ్బందితో ప్రచారం జరిగింది. దీంతో ప్రజలు సచివాలయాలనే ఆశ్రయించారు. రాష్ట్రంలో 2019లో 11వేలకుపైగా మీసేవ కేంద్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటి ద్వారా రెవెన్యూ, ఏపీఎస్పీడీసీఎల్, హెల్త్, పోలీస్, రిజిస్ట్రేషన్, ఎండోమెంట్ తదితర శాఖలకు చెందిన దాదాపు 360 సర్వీసులు ప్రజలకు అందించేవారు. ప్రభుత్వం నిర్దేశించిన రుసుంలో కొంతభాగం కమీషన్ రూపంలో మీ సేవ నిర్వాహకులకు దక్కేది. దీంతో పరోక్షంగా, ప్రత్యక్షంగా వేలాదికుటుంబాలు జీవనం సాగించేవి. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ సేవలకు మహర్దశ వస్తుందని ఆశించిన నిర్వాహకులకు నిరాశనే మిగిలింది.

గతంలో మీ సేవ నిర్వాహకులకు సంఘీభావం తెలిపిన నారా లోకేశ్ రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకు మీ సేవలకు సర్వీసులు పునరుద్ధరించకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రజలకు సులభతరమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఇటీవల ముఖ్యమంత్రి వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రారంభించారు. దీంతో మీ సేవలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడుతుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే జరిగితే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10వేల మీసేవ నిర్వాహకుల కుటుంబాలు రోడ్డునపడే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా మంత్రి లోకేశ్ ప్రకటించినప్పటికీ రాష్ట్ర స్థాయిలో గ్రామ, వార్డు సచివాలయ శాఖ అధికారులు మీ సేవల పునరుద్ధరణపై నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవచూపి మీ సేవా కేంద్రాల భవితవ్యంపై సముచిత నిర్ణయం తీసుకుని మీ సేవ కేంద్రాలకు సర్వీసులు పునరుద్ధరించాలి.

మీ సేవ కేంద్రాలను ఆదుకోవాలి



మీ సేవ కేంద్రాలను ప్రభుత్వం ఆదుకోవాలి. మంత్రి నారా లోకేశ్ హామీని అమలుపరచాలి. అద్దె, కరెంటు బిల్లు, స్టేషనరీ ఖర్చులు స్వయంగా భరిస్తూ కేంద్రాలు నడుపుతున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఇప్పటికే కొన్ని కేంద్రాలు మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశిస్తున్నా. **- కళ్యాణ్‌కుమార్ అధ్యక్షుడు, మీ సేవ కేంద్రాల అసోసియేషన్, నంద్యాల జిల్లా**

రైతుతో పాటు కాడెద్దులు మృతి

- కుటుంబంలో విషాదం



మృతి చెందిన ఎద్దులను చూపుతున్న రైతులు



భార్యతో హుసేన్‌బాషా (ఫైల్)

రుద్రవరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధారిత కుటుంబమది.. కుటుంబ యజమానితో పాటు తన కాడెద్దులు కష్టపడితేనే గాని ఆ కుటుంబానికి జీవనం ఉండదు. అలాంటిది ఆ కుటుంబ యజమానితో పాటు తన రెండు ఎద్దులు మృత్యువాత పడిన దుర్ఘటన శనివారం రుద్రవరం మండలం ఆలుమూరులో చోటుచేసుకుంది. దీంతో ఆ కుటుంబం, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలు ఇవీ.. ఆలమూరు గ్రామానికి చెందిన గోవిందిన్నె ఉహుసేన్‌బాషా (42) చెరువు పక్కనే ఉన్న తన పొలంలో వరి నాటేందుకు మడక దున్నాడు. ఎద్దులకు మట్టి అంటడంతో పై కడిగేందుకు చెరువులోకి తోలుకెళ్లాడు. చెరువులో ఎద్దులు కాస్త ముందుకెళ్లాయి. అక్కడ గుంతలో పడటంతో రెండు ఎద్దులు మృతి చెందాయి. టైర్ల బండి గుంతలో పడడంతో బండిపై ఉన్న రైతు నీట మునిగి ఈత రాకపోవడంతో మృత్యువాతపడ్డాడు. హుసేన్‌బాషాకు చెందిన కాడెద్దులు నీటిలో మునిగి చనిపోయాయి. ఇవి సుమారు రూ.2లక్షలు విలువ చేస్తాయని స్థానికులు తెలిపారు.

రైతు కుటుంబంలో విషాదం

గోవిందిన్నె హుసేన్‌బాషాకు భార్య షకీలాపర్వీన్, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వీరిలో పెద్దమ్మాయికి వివాహమైంది. ఆషియా అనే రెండో అమ్మాయి ఇంటర్, కుమారుడు సద్దాం 8వ తరగతి చదువుతున్నాడు. భార్య పర్వీన్, బిడ్డలు విషాదంలో మునిగారు. యజమాని మృతితో కుటుంబంలో విషాదం అలుముకుంది. మృతుని భార్య షకీలా పర్వీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ మహ్మద్‌రఫి తెలిపారు. ప్రమాద స్థలాన్ని సందర్శించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ వివరించారు.

ప్రమాదానికి ఆ గుంతే కారణం

ఆలమూరు చీలబోయిన చెరువులో అక్రమంగా మట్టి రవాణా చేయకుండా దారికి అడ్డంగా చెరువు గట్టు సమీపంలో అధికారులు గుంత తవ్వారు. ఆ గుంతే రైతుకు శాపంగా మారిందని గ్రామస్థులు తెలిపారు.

తానా చేయూతతో కప్పట్రాళ్ల విద్యార్థినికి ర్యాంకు

- ఉన్నత చదువుకు పొట్లూరి రవి సహాయం



తానా ప్రతినిధులతో కప్పట్రాళ్ల విద్యార్థిని మైమూన్

దేవనకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ పొట్లూరి రవి కర్నూలు జిల్లాలోని కప్పట్రాళ్ల గ్రామ అభివృద్ధికి, మహిళల స్వయం ఉపాధికి, విద్యార్థుల చదువుకు సహాయం అందిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన మైమూన్ ఇంటర్మీడియెట్ విద్యాభ్యాసానికి ఆయన రూ.1.75 లక్షల సహాయం అందించి ప్రైవేట్ రెసిడెన్షియల్ కాలేజీలో చదివించారు. రవి ప్రోత్సాహంతో ఆమె నేడు ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ చాటడంతో పాటు ఏపీ ఈఏపీ సెట్‌లో 6,947 ర్యాంక్ సాధించి వెటర్నరీ కాలేజీలో స్థానం సాధించింది. దీంతో మైమూన్‌ను శనివారం కర్నూలులో జరిగిన కార్యక్రమంలో రవి అభినందించారు. మైమూన్ మాట్లాడుతూ రవి సహాయం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో జగదీష్ రెడ్డి అనుముల, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్, ముప్పా రాజశేఖర్, ఏవో అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కౌలూరు సర్పంచ్‌కు అరుదైన గౌరవం



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ బాలయ్య

పాణ్యం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో శుక్రవారం జరిగిన 79వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో నంద్యాల జిల్లా పాణ్యం మండలం కౌలూరు సర్పంచ్ ఊడల బాలయ్య కేంద్ర జలశక్తి అధికారుల నుంచి అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ముద్రించిన వాయిస్ ఆఫ్ చేంజ్ పుస్తకంలో కౌలూరు గురించి వ్యాసాన్ని ముద్రించారు. తాగునీరు, పారిశుధ్యం, స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దినందుకు పురస్కారం లభించినట్లు శనివారం సర్పంచ్ బాలయ్య తెలిపారు.

కుక్కల దాడిలో 40 గొర్రె పిల్లలు మృతి

ప్యాపిలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం కుక్కల దాడిలో 40 గొర్రె పిల్లలు మృతి చెందాయి. దీంతో దాదాపు రూ.2లక్షల నష్టం వాటిల్లింది. స్థానిక కిందిగేరికి చెందిన బాలచంద్రుడు కల్లందొడ్డిలో గొర్రె పిల్లలను వదిలాడు. ఎవరూ లేని సమయంలో కుక్కలు కల్లం దొడ్డిలోకి వెళ్లి గొర్రె పిల్లలపై దాడి చేశారు. ఈ దాడిలో 40 గొర్రె పిల్లలు మృతి చెందాయి. ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

మావోయిస్టు నేత చిన్నన్నకు విప్లవ వీడ్కోలు



విప్లవ జోహార్లు అర్పిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు



గ్రామంలో ఊరేగింపు

- కమ్యూనిస్టు సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు
- తరలివచ్చిన మాజీ నక్సల్స్, అమరవీరుల, బంధుమిత్రుల కమిటీ ప్రతినిధులు
- మఫ్టీలో వడ్లరామాపురం చేరుకున్న పోలీసులు
- అంత్యక్రియలకు హాజరైన వారి వివరాల సేకరణ?

ఆత్మకూరు/ఆత్మకూరురూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని చౌకీ జిల్లాలో గల రాజ్‌నంద్‌గావ్- కాంగేర్ సరిహద్దులో మూడు రోజుల క్రితం పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు నేత సుగులూరు చిన్నన్న అలియాస్ విజయ్‌కుమార్ అంత్యక్రియలు విప్లవ వీడ్కోలు నడుమ సాగాయి. శనివారం ఉదయం 11గంటల సమయంలో ఆయన మృతదేహం స్వగ్రామమైన ఆత్మకూరు మండలంలోని వడ్లరామాపురం గ్రామానికి చేరుకుంది. అప్పటికే గ్రామానికి మాజీ మావోయిస్టులు, విరసం సభ్యులు, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ ప్రతినిధులు, మావోయిస్టు పార్టీ సానుభూతిపరులు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ, జనశక్తి, పౌరహక్కుల సంఘం ప్రతినిధులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. చిన్నన్న మృతదేహంపై ఎర్రజెండా కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. ఎర్రజెండాలతో కవాతు నడుమ ఆయన మృతదేహాన్ని ట్రాక్టర్‌లో ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామశివారులోని ఆయన సొంత పొలంలో కమ్యూనిస్టు సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలను పూర్తిచేశారు. ఈ సందర్భంగా పలువురు మావోయిస్టు నేత సుగులూరు చిన్నన్నతో తమకు ఉన్న అనుభవాలను పంచుకున్నారు. ప్రత్యేకించి విప్లవ రచయితల సంఘం సభ్యుడు పినాకపాణి, న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి నరసింహయ్య, జనశక్తి నేత సుంకన్న మాట్లాడుతూ పాతికేళ్ల క్రితం నల్లమల ప్రాంతంలో భూస్వామ్య వ్యతిరేక, అగ్రకుల అణచివేత, దళిత ఆత్మగౌరవ, ఫ్యాక్షనిజం, మహిళల వ్యక్తిత్వానికి సంబంధించి జరుగుతున్న విస్తృత స్థాయి పోరాటాల్లో జరిగాయన్నారు. అదేక్రమంలో భవనాశి దళం పేరిట జరిగిన అనేక రైతాంగ, భూస్వాధీన పోరాటాలు, అగ్రకులాల అన్యాయాలకు వ్యతిరేకంగా పీపుల్స్ వార్ ఉద్యమాలు జరిగిన సందర్భంలో ఒక మామూలు దళిత వ్యవసాయ కుటుంబంలో జన్మించిన కామ్రేడ్ చిన్నన్న విప్లవోద్యమం వైపు బాటలు వేశారని అన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ప్రజా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఇదిలావుంటే చిన్నన్న అంత్యక్రియల నేపథ్యంలో పలువురు పోలీసు అధికారులు మఫ్టీలో వడ్లరామాపురం గ్రామానికి చేరుకున్నారు. అక్కడికి వచ్చిన వివిధ ప్రజా సంఘాల నేతలు, మాజీ మావోయిస్టుల పేర్లను ఆరా తీసినట్లు తెలిసింది. సుగులూరు చిన్నన్నతో వారికి ఉన్న అనుభవాలను పంచుకున్న వ్యక్తుల వివరాలు, వ్యక్తుల ప్రసంగాలను సేకరించినట్లు సమాచారం. అంత్యక్రియల్లో హాజరైన వారిలో ప్రముఖ వైద్యులు నాగన్న, గౌరీనాథ్, పద్మ, అంజమ్మ ఉన్నారు.



నంద్యాలలో ఇండ్లు/అపార్ట్‌మెంట్స్

స్థలాలు, పొలాలు, షాపులు అందుబాటు ధరలలో చూపబడును. స్టార్ రియల్ ఎస్టేట్స్, సి.పి.కాంప్లెక్స్ వెనుక, నంద్యాల. సెల్ : 87908 44959. గమనిక : ఇల్లు అద్దెకు కావలన్నా చూపబడును. AJL-247522

PLOT FOR SALE

కర్నూలు సి క్యాంప్ సెంటర్ దగ్గర గణేష్ నగర్ అనుకొని మదర్ ల్యాండ్‌లో ఉత్తరం, తూర్పు, దక్షిణం, పడమర ముఖం గల ప్లాట్లు అమ్మకమునకు కలవు. సంప్ర.9346770747 AJL-236693

WANTED

కర్నూలు మరియు కడప జిల్లాలలో ప్రభుత్వ మరియు ప్రవేటు బ్యాంక్స్ & NBFC లలో Personal loans, Business loans, Home loans ఇవ్వడానికి Inter, Degree అర్హత కలిగిన Male Female అభ్యర్థులు కావలెను. 20K Salary మరియు Insentive యివ్వబడును. Contact No: 9177767017, 9441608868 AJA-237785

CHANGE OF SURNAME

I, SEKIREDDY MALLESWARAMMA (Old Surname) W/o. SEKIREDDY SUDARSHAN REDDY, H.No: 27-11 F, Mulasagaram, Nandyal-518501, Nandyal (District), AP., hereby state that I have Changed my Surname as SEKIREDDY MALLESWARAMMA (Old Surname) to VADDU MALLESWARAMMA (New Surname) and Known as VADDU MALLESWARAMMA AJL-247523

PASSPORT MISSING

I, SYED MERAJUDDIN, S/o.Syed Abdul Vakil, R/o. H.No:30/146-A, Chittari Street, Kurnool District -518001, AP., have lost my Indian Original passport bearing No:K6914533, Date of Issue: 02/11/2012 & Date of Expiry: 01/11/2022 & Place of issue:Hyderabad. while I was travelling on my bike along with photo copies of my aadhaar and other documents on 04/08/2025 at Chittari Street main road. If anyone found please inform to the above address. AJL-236842

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/ క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

సందర్భమేదైనా ఆంధ్రజ్యోతి ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఆంధ్రజ్యోతి లో ప్రకటనల ద్వారా తెలియజేయండి.

చిన్న ప్రకటన పెద్ద స్పందన | వివాహాది శుభాకాంక్షలు | పదవీ విరమణ | విదేశీ & స్వదేశీ యానం | లీగల్ ప్రకటనలు | అంత్యక్రియలు & జయంతి, వర్ధంతి

వేడుక ఏదైనా... ఆంధ్రజ్యోతి ను చేసుకోండి వేదిక

ఆంధ్రజ్యోతి యాడ్స్ ద్వారా తెలియజేయండి.

ప్రకటనల కొరకు సంప్రదించండి. 99854 02121

ఆంధ్రజ్యోతి పత్రిక కోసం సంప్రదించండి. 99854 11364

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

అభివృద్ధి, సంక్షేమంతో పాలన

● రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

● మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓ వైపు అభి వృద్ధి, మరో వైపు సంక్షేమం దిశగా తమ ప్రభుత్వ పాలన కొనసాగుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు భ్రష్టు పట్టాయని, కూటమి పాలన వచ్చిన తర్వాతనే ఆర్థిక పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు తన సామర్థ్యంతో మెరుగు పరిచారన్నారు. శనివారం కర్నూలు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం యార్డు ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మంత్రి టీజీ భరత్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆదోని టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఆకెపోగు ప్రభాకర్ హాజరయ్యారు. కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, చైర్‌పర్సన్ గొల్కొండ అజ్మిత్ బీ, వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి, డైరెక్టర్లతో మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు నగరానికి చెందిన వారికి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి దక్కడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు గోల్కొండ హమీద్, అబ్బాస్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నగేష్ పాల్గొన్నారు.

నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ



కళ్లను డీఎంహెచ్‌వోకు అందజేస్తున్న డాక్టర్ సుధాకర్ రావు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ అన్నారు. సుశీల నేత్రాలయ ఐ డోనేషన్ సెంటరులో మొట్టమొదటిసారిగా నగరంలోని కింగ్ మార్కెట్‌లో గుండెపోటుకు మరణించిన 72 ఏళ్ల జయలక్ష్మి నుంచి నేత్రాలను సేకరించారు. శనివారం ఉదయం సుశీల నేత్రాలయ అధినేత డాక్టర్ పి.సుధాకర్‌రావు సేకరించిన నేత్రాలను డీఎంహెచ్ వోకు అందజే శారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీకి నేత్రాల సేకరణకు అనుమతి ఉందని, కొత్తగా కలెక్టర్ ఆదేశాల మేరకు సుశీల నేత్రాలయ అండ్ మెటర్నిటి హాస్పిటల్‌కు ఐ డొనేషన్ సెంటర్‌కు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. మరణానంతరం 6 నుంచి 12 గంటల వరకు నేత్రాలను దానం చేయవచ్చునన్నారు. నేత్రదానానికి సహకరించిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థను డీఎంహెచ్‌వో అభినందించారు. నేత్రాలను దానం చేయాల్సిన వారు సుశీల నేత్రాలయ ఐ డోనేషన్ సెంటర్ 8886306308 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. డాక్టర్ పి.సుధాకర్‌రావు మాట్లాడుతూ సేకరించిన కళ్లను సికింద్రాబాదు వాసన్ ఐ బ్యాంకులో పంపించామన్నారు. హాస్పిటల్‌లో కళ్లను స్టోరేజ్ చేయడానికి అన్ని వసతులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కార్నియా స్పెషలిస్టు డాక్టరు రాఘవ్ ప్రీతమ్, రెటినా స్పెషలిస్టు డాక్టరు నేహ సుధాకర్, అకినోప్లాస్టి స్పెషలిస్టు డా.నేహాఘోష్, గైనకాలజిస్టు సావిత్రి, గ్లకోమా స్పెషలిస్టు విజయలక్ష్మి పాల్గొన్నారు.

హామీలను అమలు చేయండి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎల్లయ్య అధ్యక్షతన వీరనారి ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రజకులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులకు వ్యతిరేకంగా ఈ నెల 25న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్‌ల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో న్యూసిటీ కార్యదర్శి సి.శేషాద్రి, నగర అధ్యక్షుడు రాముడు, రమణ, రేణుక, అంజి, శేఖర్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ర్యాలీని జయప్రదం చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ట్రంప్, మోదీ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో చేపడుతున్న నిరసనలు, ర్యాలీలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం, జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న ఒప్పందం విదేశీ విధానాలతో భారతదేశం ఆర్థిక వ్యవస్థ పతనం అవుతుందన్నారు. వ్యవసాయంపై ఆధారపడ్డ రైతులు, వ్యవసాయ కూలీలు వారు పండించుకున్న పంటలకు నష్ట వాటిల్లుతుం దన్నారు.

'జగన్ పద్ధతి మార్చుకోవాలి'

కర్నూలు అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పద్ధతి మార్చుకోవాలని డీసీసీ సెక్రటరీ, ఆర్యవైశ్య నాయకుడు సుబ్రమణ్యం శెట్టి అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్‌ను విమర్శించే ముందు వైసీపీ స్టాండేంటో ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న కార్యక్రమాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

ఘనంగా విలియం కేరీ జయంతి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని కిడ్స్ వరల్డ్ భవనంలో జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విలియం కేరీ 264 జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కేవీ.సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, 17వ వార్డు టీడీపీ కార్పొరేటర్ క్రైప పద్మలతారెడ్డి, మన్సూర్ అలీఖాన్, బందెల రాజు హాజరయ్యారు. విలియం కేరీ గొప్పతనాన్ని మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు రవికుమార్ వివరించారు. విలియంకేరీ బైబిల్ అనువాదంలో, విద్య, సామాజిక సంస్కరణలలో గొప్ప కృషి చేశారని కొనియాడారు. అనంతరం అతిథులు పాస్టర్లను సన్మానిం చారు. మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రాజేష్, క్రిష్టఫర్, సుధీర్‌కుమార్, ప్రసాదరావు, మద్దిలేటి పాల్గొన్నారు.

లద్దగిరి సొసైటీ చైర్మన్‌గా పట్టె కృష్ణుడు

కోడుమూరు రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్దగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నాయ కుడు పట్టె కృష్ణుడు నియమి తులయ్యారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత 40 ఏళ్ల నుంచి పార్టీకి అందించిన సేవలను గుర్తించి కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సహకారంతో సొసైటీ చైర్మన్ పదవి వరించిందన్నారు. సోమవారం పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

సర్వం కృష్ణమయం



● ఘనంగా కృష్ణాష్టమి సంబరాలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నగరంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం కోలాహలంగా సాగాయి. వివిధ ప్రాంతాల్లో, అపార్ట్‌మెంట్‌లలో శ్రీకృష్ణ, గోపిక, రాధ వేషధారణలతో చిన్నారులను ముస్తాబు చేసి సందడి చేశారు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని రుక్మిణీ సమేత శ్రీకృష్ణ మందిరంలో యాదవ కులస్థుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరిగాయి. కలెక్టరేట్ శ్రీకృష్ణ భగవానుడి విగ్రహంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, డాక్టర్ బాలమద్దయ్య యాదవ్, లక్కీ టూ రాంపుల్లయ్య యాదవ్, నరసింహులు యాదవ్, ఆదర్శ విద్యాసంస్థల అధినేత డాక్టర్ హరికిషన్ యాదవ్, యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయ్యన్న యాదవ్, బీజేపీ నాయకులు శ్రీరామ్ యాదవ్, నాగరాజు యాదవ్, టీడీపీ నాయకులు ప్రభాకర్ యాదవ్, ఏంవీఎస్ రాజు యాదవ్, విజయలక్ష్మి, ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు జేవీ కృష్ణయ్య తదితరులు ప్రసంగించారు. ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో శనివారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దేవి ఫంక్షన్ హాలులో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక పోటీలు ఏర్పాటు చేశారు. గో సంరక్షణశాలలో ఉదయం శ్రీకృష్ణ విగ్రహానికి పంచా మృతాభిషేకాలు నిర్వహించారు. రాత్రి ఉట్టి కొట్టే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

శ్రీకృష్ణ తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి: టీజీ వెంకటేశ్

శ్రీకృష్ణ తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శనివారం రాత్రి నగరంలో వెంకటరమణ కాలనీలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో, భరత మాత మాతృమండలి నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలకు టీజీ వెంకటేశ్ దంపతులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ, రాధ, గోపికల వేషధారణల్లో ఉన్న చిన్నారి బాలబాలికలతో టీజీ వెంకటేశ్ ఉత్సాహంగా గడిపారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత 27 ఏళ్లుగా భరతమాత మాతృమండలి సంస్థ ప్రతినిధులు ఏటా శ్రీకృష్ణ జన్మాష్టమిని ఘనంగా నిర్వహిస్తూ మన సంస్కృతికి, సంప్రదాయాలను ముందుకు తీసుకుపోవడం అభినందనీయమని అన్నారు. పోటీల్లో పాల్గొన్న చిన్నారి బాలబాలికలను, విద్యార్థులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సీనియర్ వీహెచ్‌పీ నాయకుడు ఇ.మల్లికార్జున రెడ్డి, భరత మాత మాతృమండలి అధ్యక్షురాలు ఇ.పద్మావతమ్మ, కార్యదర్శి పి. జయలక్ష్మి, జి. శ్రీదేవి, కె.స్వప్నసారధి, పి. మహాలక్ష్మి, ఆర్ అనూరాధ, ఎస్ క్రిష్ణవేణి, డి.హేమలత, రజనీ కల్యాకర పాల్గొన్నారు.

కోడుమూరు: పట్టణంలోని కృష్ణుడు ఆలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనం తరం గిరికబండి లాగుడు పోటీలను నిర్వహించారు. అలాగే ఉట్టి కొట్టు వేడుకల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొ న్నారు. సాయంత్రం కృష్ణుడు విగ్రహాన్ని వీధుల గుండా ఊరే గించారు. చిన్నా రులు కృష్ణుడు, గోపికల వేషధారణ అల రించారు.

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరులోని శ్రీకృష్ణ ఆలయంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. తుల సీమాల, పూలమాలలు, పట్టువస్త్రాలతో స్వామిని అలంకరించారు. కార్యక్రమంలో వెంకటరాముడు, నారాయణ, చిన్న హనుమన్న, నారాయణరెడ్డి, కృష్ణమూర్తి, మల్లకల్లు, తోటయ్య పాల్గొన్నారు.

సి.బెళగల్: మండలంలోని పోలకల్లు, సి.బెళగల్ బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి, తదితర గ్రామాలలో కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని ఆలయాలలో కృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దస్తగిరి, శేఖర్, రాముడు, లింగన్న పాల్గొన్నారు.

ఓర్వకల్లు: కృష్ణాష్టమిని పురస్కరించుకుని శ్రీకృష్ణుని ఆలయాల్లో శనివారం స్వామివారికి భక్తులు పూజలు చేశారు. ఓర్వకల్లులో త్రైత సిద్ధాంత ఆచార్య ప్రభోదానంద యోగీశ్వరుల స్వామి ఆధ్వర్యంలో శ్రీకృ ష్ణుని విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని ఆలయంలో శ్రీకృ ష్ణునికి పూజలు చేశారు. చెన్నకేశవస్వామి భజన మండలి పాడిన పాటలు ఆకట్టుకున్నాయి.



దేవి ఫంక్షన్ హాలులో ఇస్కాన్ పూజల్లో శ్రీకృష్ణుడు, ఓర్వకల్లులో..



ఉట్టి కొడుతున్న మహిళ, పార్కు రోడ్డులోని గో సంరక్షణశాలలో విశేష అలంకరణలో శ్రీకృష్ణుడు



కర్నూలులో మాట్లాడుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, కోడుమూరులో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు



నీతి, నిజాయితీకి మారుపేరు కోట్ల

● మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు ● కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ సీఎం జయంతి

కర్నూలు అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయితీకి మారుపేరు మాజీ సీఎం కోట్ల విజయ భాస్కరరెడ్డి అని మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ డీసీసీ కె.బాబురావు, నాయకులతో కలిసి కోట్ల విజయభాస్కరరెడ్డి జయంతి వేడుకలు నిర్వహించారు. అంతక ముందు కోట్ల సర్కిల్‌లో కోట్లవిజయభాస్కర్‌రెడ్డి కాంస్య విగ్రహానికి , జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యక ర్తలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు బి. బ్రతుకన్న, ఎస్సీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాజా హుస్సేన్, అమన్, దామోదరం రాధాకృష్ణ, లాజరస్, సత్యరాజు పాల్గొన్నారు.

కోడుమూరు: కర్నూలు జిల్లాకు మాజీ ముఖ్యమంత్రి దివంగత కోట్ల విజయభాస్కర రెడ్డి జిల్లాగా పేరు పెట్టాలని వ్యాపారవేత్త ఎద్దుల మహేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. కోడుమూరులో దివంగత మాజీ ముఖ్య మంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడి జయంతి వేడుకలు శనివారం కోట్ల అభి మానుల సమక్షంలో నిర్వహించారు. కోట్ల కాంస్య విగ్రహానికి క్షీరాభిషేకం చేపట్టారు. మాజీ సర్పంచులు సీటీ లత, కేఈ రాంబాబు, సర్పంచు భాగ్యరత్న, మాజీ సింగిల్‌విండో నాయకులు మధుసూదన్‌రెడ్డి, హేమాద్రిరెడ్డి, టీడీపీ నాయకులు తిరుమల్‌నాయుడు, కోట్ల అభిమానులు రాంమోహన్, భాస్కర్ రెడ్డి, వెంకటస్వామి ఆచారి, జీతూరి రవి, ఇక్బాల్ పాల్గొన్నారు.

గూడూరు: గూడూరులో దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. చరణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో భాగంగా కర్నూలు జిల్లాకు కోట్ల జిల్లాగా పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. టీడీపీ నాయకులు చెట్టుకింది సురేష్, అయ్యవారి నాయుడు, నారాయణ, సంగాల మధు, మూలగేరి లక్ష్మన్న, నాగరాజు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యాలయంలో కోట్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు, కోడుమూరులో..

బడుగుల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న



సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

కర్నూలు అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న అని ఈడిగ, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కేఈ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం రాత్రి నగరంలోని గౌడ సంఘం కార్యాలయంలో జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కేఈ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న పోరాట యోధుడే కాక, గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఆయన జయంతిని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. వర్కింగ్ ప్రెసి డెంట్ కాసాని మహేష్ గౌడ్, కోశాధికారి నాగశేషన్న గౌడ్, ఉపా ధ్యక్షులు గంగాధర్ గౌడ్, శ్రీరాములు గౌడ్, ప్రసాద్ గౌడ్, అంజి, నరసింహగౌడ్, శ్రీనివాసులు గౌడ్, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న సేవలు మరువలేనివి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్: స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న అణగారిన వర్గాల కోసం చేసిన సేవలు మరువలేనివని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్, వివిధ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో కీలకంగా వ్యవహరించిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ఏటా అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రసూన, మహేష్ గౌడు, రవిశంకర్ గౌడు పాల్గొన్నారు.

నేడు ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 68 ఏళ్ల పూర్తిచేసుకొని, 69వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆదివారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు నగరంలోని వెంకటరమణ కాలనీలోని కీర్తన అనాథ ఆశ్రమంలో ఈ వేడుకలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

క్రీడాకారులకు అభినందన

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రెండో జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19 నుంచి 21 తేదీల్లో జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని డీఎస్‌డీవో భూపతి రావు అన్నారు. శనివారం జరిగన అభినందన సభలో ఆయన పాల్గొని ప్రతిభ కనబరిచిన పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను అభినందించారు. భూపతిరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ ఉపాధ్యక్షులు ముసామియా, సెక్రటరీ లోకేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేణుగోపాల్, జాయింట్ సెక్రటరీ రేష్మా తదితరులు పాల్గొన్నారు.

'వీహెచ్‌పీ సామాజిక సేవలను మరింత విస్తరించాలి'

కర్నూలు కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) చేపడుతున్న సామాజిక సేవలను గ్రామీణ స్థాయి వరకు విస్తరింపజేయాలని వీహెచ్‌పీ ధర్మప్రసార రాష్ట్ర కన్వీనర్ అనంత విశ్వ ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని హరి శ్చంద్రనగర్‌లోగల సద్గురు త్యాగరాజ సీతా రామాలయంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ దినోత్సవ వేడు కల్లో ఆయన ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. వీహెచ్‌పీ ఆవిర్భవించి 60 సంవత్సరాలు పూర్తయింద న్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగి భానుప్రకాశ్, మాతృశక్తి విభాగ్ కన్వీనర్ పావని, వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు ఎస్ రాంబాబు, ప్రవీణ్, అశ్విని, పూజిత, వజన, కవిత, హారిక, అనిత పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలను విజయవంతం చేద్దాం

● గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో గణేష్ ఉత్సవాలను విజయవంతం చేద్దాం అని గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని వినాయక ఘాట్‌లోగల గణేశ్ మందిర సమావేశ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 43 ఏళ్లుగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని, ఈ ఏడాది కూడా అలాగే నిర్వహించుకోవాలన్నారు. గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి రాష్ట్ర కార్యదర్శి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ ఈనెల 27న గణేశ్ మంటపాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు ప్రారంభిస్తామని కర్నూలులో సెప్టెంబరు 4న నిమజ్జనోత్సవం ఉంటుందన్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో అధికారుల సూచన మేరకు నిమజ్జనోత్సవాలు చేపట్టాలని పేర్కొన్నారు. కలెక్టర్, ఎస్పీ, అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమితి నగర అధ్యక్షుడు ఎస్ రంగస్వామి మాట్లాడుతూ గణేశ్ ఉత్సవ కేంద్ర సమితి వద్ద ప్రతి మంటపం నిర్వాహకుడు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే మంటప నిర్వాహకుల సూచనలు స్వీకరిస్తారమని, వారికి సూచనల కరపత్రాలు అందజేస్తామన్నారు. ఉత్సవ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల రమణ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో హిందువులను సంఘటితం చేసేందుకు ఆ నాడు తిలక్ ఉత్సవాలను ప్రారంభించారని, ప్రస్తుత పరిస్థితుల్లో హిందూ సంఘటితానికి ఉత్సవాలు ఎంతో అవసరమని అన్నారు. ఉత్సవాల సలహాదారు డాక్టర్ కొట్టే చెన్నయ్య మాట్లాడుతూ సంస్కృతీసంప్రదాయాలను చాటిచెప్పే కార్యక్రమాలను ఏర్పాటు చేశామని, అందులో విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సమావేశంలో ఉత్సవ సమితి సభ్యులు అంబలి కాశీ విశ్వనాథ్, నగర సమన్వయ కార్యదర్శి మాళిగి భానుప్రకాశ్, ప్రచార, ప్రసార విభాగాల కన్వీనర్ అక్కెం విశ్వనాథ్, కార్యదర్శి ఈపూరి నాగరాజు, గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

24న గిరిజన సలహా మండలి సభ్యుడికి సన్మానం

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు గిరిజన భవన్‌లో ఈనెల 24న గిరిజన సలహా మండలి సభ్యుడు వెంకటపతికి సన్మాన సభను నిర్వహిస్తున్నట్లు టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప అన్నారు. శనివారం టీఎస్ఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక సామాన్య ఎరుకలి కులానికి చెందిన వెంకటపతికి గిరిజన సలహా మండలి సభ్యుడిగా నియమించడం గర్వకారణన్నారు. నాయకులు రామరాజు, వెంకటేశ్, రామకృష్ణ, రామాంజనేయులు, శివయ్య పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు స్ఫూర్తితో ముందుకు..



విద్యార్థిని సత్కరిస్తున్న డాక్టర్ షఫీ, గజల్ గాయకుడు మహమ్మద్ మియా తదితరులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో పీ4 కింద కులుమాలలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను దత్తత తీసుకున్నామని గజల్ గాయకుడు మహమ్మద్ మియా అన్నారు. తాను విద్యార్థిగా చదువుకున్న ఈ పాఠశాలలో గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు జోహరాపురం ప్రగతి, చాకలి మధు, షేక్ రిజ్వానాలకు స్వాంతంత్ర్య వేడుకల్లో భాగంగా ఒక్కొక్కరికీ రూ.3వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేసి, ఆయన ఘనంగా సత్కరించారు. అలాగే పాఠశాలకు లైబ్రరీకి అవసరమయ్యే పుస్తకాలను విరాళంగా అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ షఫీ, గ్రామ పెద్దలు వాల్మీకి మహర్షి, నరసింహులు, బీసీ మాదన్న, చాంద్‌బాషా, వడ్డె తిమ్మన్న, బాబీబాయి పాల్గొన్నారు.

సంత.. చింత..!

● ఆరుబయటే కూరగాయల విక్రయాలు

● ఇబ్బందుల్లో వ్యాపారులు, వినియోగదారులు

ఓర్వకల్లు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు సంత సమస్యలకు నిలయంగా మారింది. ఆరుబయటనే సంత జరుగుతుండటంతో కనీస మౌలిక సదుపాయాలు లేక వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి శనివారం ఓర్వకల్లులోని చెన్నకేశవస్వామి ఆలయం ఎదురుగా జరిగే సంతకు మండలంలోని కన్నమడకల, గుట్టపాడు, ఎన్.కొంతలపాడు, తిప్పాయపల్లె, శకునాల, బ్రాహ్మణపల్లె గ్రామాల నుంచి కూరగాయలు, చిరుధాన్యాలకు ఓర్వకల్లు సంతకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పంచాయతీకి ఆదాయ వనరులున్నా అధికారులు మార్కెట్ యార్డు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించలేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్ నిర్వహణ కోసం షెడ్డు ఏర్పాటు చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.



ఓర్వకల్లులో రోడ్డుపైనే కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు

కనీస సౌకర్యాలు కరువాయె



సంతలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో వ్యాపారం అంతంత మాత్రమే జరుగుతుంది. ఎండకు, వానకు కూరగాయలు, నిత్యావసర వస్తువులు చెడిపోయి తీవ్రంగా నష్టపోతున్నాం.

● శకుంతలమ్మ, వ్యాపారి, ఓర్వకల్లు

మార్కెట్ ఏర్పాటు చేయాలి



సంత నిర్వహణకు ఓర్వకల్లుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూరగా యలు, చిరుధాన్యాల కోసం వస్తుంటారు. సంత మార్కెట్ లేకపోవడంతో వ్యాపారులు వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలి.

● కురువ నాగరాజు, స్థానికుడు

'తాగునీటి శుద్ధిపై జాగ్రత్త తీసుకోవాలి'

ఆదోని టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సరఫరా అవుతున్న తాగునీటిని శుద్ధి చేయడంలో మున్సిపల్ అధికారులు జాగ్రత్త తీసుకోవాలని స్త్రీలు, పిల్లల ప్రభుత్వ ఆసుపత్రి సలహా మండలి మాజీ సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ కోరారు. శనివారం మాట్లాడుతూ తాగునీటిని శుద్ధి చేయని కారణంగా ప్రజలు విరేచనాలు, జ్వరం, జలుబు బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా ప్రాంతాల్లో రంగు మారిన నీరు వస్తోందన్నారు. కమిషనర్ స్పందించి, సిబ్బందికి సూచనలు ఇవ్వాలని కోరారు.

మచ్చలేని నాయకుడు కోట్ల

ఆదోని టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ సీఎం కోట్ల విజయ భాస్కర్ రెడ్డి మచ్చలేని నాయకుడని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, మాజీ కౌన్సిలర్ దిలీప్ ధోకా అన్నారు. శనివారం 150వ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. కాంగ్రెస్ హయాంలో కేంద్ర మంత్రిగా, పార్టీ క్రమ శిక్షణా సంఘం చైర్మన్‌గా పని చేశారన్నారు. మారుతి రావు, దేవిశెట్టి వీరేష్, శ్రీనిత్, చేతన్ ధోకా, తాయన్న ఉన్నారు.


నివాళి అర్పించిన నాయకులు

ఉపాధ్యాయులపై భారం సరికాదు


నిరసన తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులపై భారం మోపడం సరికాదని, నూతన మూలాంకన విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి, ప్రధాన కార్యదర్శి జనార్ధన్ డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు యాప్‌ల భారాన్ని తొలగిస్తానని చెప్పి ఇప్పుడు భారం మోపారన్నారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీని నియమించి 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. వీర చంద్ర యాదవ్, నాగరాజు, రమేష్ నాయుడు, నాగేంద్రప్ప, సంకన్న ఉన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా చేసుకోవాలి

వెల్దుర్తి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా చేసుకోవాలని సీఐ మధుసూదనరావు సూచించారు. శనివారం వెల్దుర్తి సర్కిల్ కార్యాలయంలో ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించవద్దని, డీజేలతో శబ్దాలు చేయకుండా భక్తిభావంతో నిర్వహించుకోవాలన్నారు. పోలీసుల సూచనలు పాటించి శాంతియుతంగా నిమజ్జనం చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్, ట్రైనీ ఎస్ఐ విద్యశ్రీ, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ మధుసూధనరావు

ఎస్ఐకి సన్మానం

తుగ్గలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున ఉత్తమ సేవలందించారని టీడీపీ నాయకులు సంగాల కృష్ణ, హోటల్ మల్లి అన్నారు. శుక్రవారం స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం తీసుకున్న ఎస్ఐను శనివారం సన్మానించారు. పోలీసులు సక్రమంగా పనిచేస్తేనే గ్రామాల్లో అల్లర్లు జరగవన్నారు. జయరాం, అంజి ఉన్నారు.

జాగ్రత్తలతో పంట క్షేమం

● పొలంలోని నీటిని బయటకు పంపాలి ● సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి : ఏవో


పొలంలో నిలిచిన నీరు, ఇన్‌సెట్‌లో వ్యవసాయాధికారి రవి

మద్దికెర ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వారం నుంచి వర్షాలు కురుస్తుండటంతో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఏవో రవి సూచించారు. శనివారం మాట్లాడుతూ మండలంలో 7,500 హెక్టార్లలో పత్తి, వేరుశనగ, జొన్న, కంది పంటలు సాగు చేశారని పొలంలో నీరు ఉండకుండా చూసుకోవాలన్నారు.

పత్తిలో జాగ్రత్తలు..

పొలంలో నీరు నిల్వ ఉంటే తేమ అధికమై పత్తి పిందెలు, కాయలు రాలిపోయే ప్రమాదం ఉందని, ఆకులు వాడిపోతాయన్నారు. పొలం ముంపునకు గురైనప్పుడు నీటిని తీసేయడంతో పాటు ఎండగా ఉన్న సమయంలో లీటరు నీటికి పొటాషియం నైట్రేట్ 5 గ్రాములను కలిపి, లేదా ఒక శాతం యూరియా ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో మార్చి మార్చి పిచికారీ చేయాలి. పూత, పిందె దశలో తీసిన తర్వాత ఎకరాకు 30 కిలోల యూరియాను 1.5 కిలోల పోటాష్ ఎరువులను పైపాటుగా వేసుకోవాలన్నారు. అలాగే వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు మెగ్నీషియం సల్ఫేట్ పిచికారీ చేయాలని సూచించారు. తేమ అధికంగా ఉంటే వేరుకుళ్లు తెగుళ్లు, బ్యాక్టీరియా నల్లమచ్చ తెగుళ్లు, చుట్టతెగుళ్లు ఆశించే అవకాశం ఉందని, వీటి నివారణకు కాపర్ ఫ్లోరైడ్ కలిపి రెండు మూడుసార్లు పిచికారీ చేసుకోవాలని, తుప్పు తెగుళ్ల నివారణకు ప్రొపికోంజోల్ లీటరు కలిపి పిచికారీ చేయాలని వివరించారు.

కంది పంటలో..

కంది ప్రస్తుతం శాఖీయ దశలో ఉందని, పొంలోని నీటిని తీసివేసి, ఒక లీటరు నీటిలో పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. పొలం ఆరిన వెంటనే అంతర పంటలు సాగుచేయాలన్నారు. తెగుళ్ల నివారణకు డయోపివెట్ మిథైల్ ఒక లీటరు నీటిలో కలిపి మొక్కల చుట్టూ వేరు అంతా తడిసేలా పిచికారీ చేయాలని తెలిపారు.

వేరుశనగలో..

పొలంలోని నీటిని బయటకు పంపి పొలం ఆరిన తర్వాత అంతర పంటలను సాగుచేయాలన్నారు. ప్రస్తుతం తిక్క ఆకు మచ్చ తెగులు ఆశించే అవకాశం ఉందని, నివారణకు హెడ్జా కొనజోల్ ఒక మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వేరుశనగ కోతకు సిద్ధంగా ఉంటే ఈ వర్షాలు తగ్గాక కోయాలన్నారు. ఇంకా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

నీటిని బయటకు పంపాలి

ఆదోని రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల నేపథ్యంలో పత్తిపొలాల్లో నీరు నిలవ వుండకుండా బయటకు పంపాలని ఏవో సుధాకర్ శనివారం ప్రకటనలో సూచించారు. యూరియా అధికంగా వాడితే తెల్లదోమ, రసం పీల్చే పురుగుల ఉధృతి పెరుగుతుందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు యూరియా వాడాలని, పంట త్వరగా కోలుకోవడానికి నానో డీఏపీ పిచికారీ చేయాలన్నారు.


ఏవో సుధాకర్

ప్రాజెక్టులు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

దేవనకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల, మేలిగనూరు, గురురాఘవేంద్ర ప్రాజెక్టుల పనుల ఇరవై శాతం కూడా పూర్తికాదన్నారు. పంటలకు మద్దతు ధర కోసం ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి, రైతులకు న్యాయం చేయాలన్నారు. ఆనంద్‌బాబు, వీరశేఖర్, అశోక్, నూరి, యూసుఫ్‌బాషా ఉన్నారు.

కార్పొరేట్‌కు అనుకూలం

ఆదోని రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్‌కు అనుకూలంగా పాలిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు ఆరోపించారు. శనివారం మాట్లాడుతూ, 11 ఏళ్లుగా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ, పేద ప్రజల నడ్డి విరుస్తుందని మండిపడ్డారు. అజయ్ బాబు, సుదర్శన్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీ శక్తి' మహిళలకు వరం


దేవనకొండలో చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

దేవనకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న 'స్త్రీశక్తి - మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం' వరమని టీడీపీ నాయకుడు ఆకుల వీరేష్ అన్నారు. శనివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్ చిత్రపటాలకు మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కూటమి నాయకులు బండ్లయ్య, రాజాసాబ్, తిమ్మయ్య, కె ఉచ్చీరప్ప, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణంతో ఉపయోగం



నేను రోజూ గ్రామాల్లో జొన్నలు, సజ్జలు విక్రయిస్తుంటాను. బస్సు చార్జీలకే రోజు రూ.వందకు పైగా ఖర్చు వచ్చేది. సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో నాకు నెలకు రూ.3వేలు మిగులుతాయి. **- జొన్నల లక్ష్మి, దేవనకొండ.**

సీపీఐ మహాసభలకు తరలిరావాలి


పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలు నగరంలో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలకు తరలిరావాలని ఆ పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య పిలుపునిచ్చారు. శనివారం సీఆర్ భవన్‌లో పోస్టర్లను విడుదల చేశారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతుండంతో శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని, వెనకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి, భవిష్యత్ పోరాటాలకు శ్రీకారం చుడతామన్నారు భీమ లింగప్ప, కారుమంచి, సుల్తాన్, నాగరాజు, రామాంజనేయులు ఉన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

● ఆదోని, ఆలూరు, పత్తికొండలో..
● కోలాటం, అలరించిన చిన్నారుల వేషధారణ


ఆదోని వీధుల్లో కోలాటం ప్రదర్శన


ఆదోనిలో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్వాన్ పేట వేణుగోపాల స్వామి ఆలయంలో ఉదయం పూజలు చేసి, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి రథోత్సవం నిర్వహించారు. మహిళలు చిన్నారులు కళశాల చేత పట్టుకొని ఊరేగింపుగా వెళ్లారు. చిన్నారుల కోలాటాలు, బీరయ్య డోలు ఆకట్టుకున్నాయి.


తుగ్గలి: మామిళ్లకుంటలో రథోత్సవం

పత్తికొండ టౌన్: పట్టణంలోని కుమ్మరి వీధిలో శనివారం యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి నిర్వహించారు. పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. హోసూరు శ్రీనివాసులు, రామకృష్ణ, ఈరన్న, కోటి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తుగ్గలి: మండలంలోని మామిళ్లకుంట, జొన్నగిరి, రాంపురం, తుగ్గలి గ్రామాల్లో యాదవులు, గ్రామపెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికమ్మ వేషాదారణలో నృత్యాలు చేసి అలరించారు. అలాగే సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. టీడీపీ నాయకులు మిద్దె వెంకటేశ్ యాదవ్, రవి యాదవ్, లక్ష్మణ స్వామి, డీలర్ తిమ్మప్ప, గంగాధర్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మద్దికెర: పెరవలి గ్రామంలో శ్రీకృష్ణ పటాన్ని రంగనాథ స్వామి ఆలయం నుంచి గోమాతపై కృష్ణుని పటాన్ని పెట్టి ఊరేగించారు. సాయంత్రం పూజలు, రాత్రి భజన ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని విద్యాసాయి కళాశాల, పాఠశాలలో ఉట్టి కొట్టి రంగులు చల్లుకున్నారు.

దేవనకొండ: స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఉట్టి కొట్టారు. చిన్నారులకు క్రిష్ణుడు, గోపికల వేషాధారణలు ఆకట్టుకున్నాయి.

ఆస్పరి: భీమలింగేశ్వర ఆలయంలో యాదవ సంఘం నాయయకుఉలు పూజలు, అభిషేకాలు, గోపూజ, గంగపూజ నిర్వహించారు.

ఆలూరు రూరల్: మొలగవల్లి గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. టీడీపీ కన్వీనర్ అశోక్‌యాదవ్, బంగారు పటేల్ యాదవ్, ఆంజనేయ, ఎంపీటీసీ సునందపటేల్, మాజీ సర్పంచ్ రంగస్వామి ఉన్నారు.


మద్దికెరలో ఉట్టి కొడుతూ కేరింత


ఆలూరు రూరల్ : మొలగవెల్లిలో..


దేవనకొండలో ఊరేగింపు



వికటించిన ఆర్ఎంపీ వైద్యం

● కోమాలోకి వెళ్లిన మహిళ.. ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు

ఆదోని, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వచ్చీ రాని వైద్యంతో ఓ ఆర్ఎంపీ వేసిన ఇంజక్షన్‌తో మహిళ తీవ్ర అస్వస్థతకు లోనై కోమాలోకి వెళ్లింది. భయంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు నర్సింగ్ హోంలో చేర్పించారు. మూడు రోజులుగా ప్రైవేటు ఆసుపత్రిలోనే చికిత్స పొందుతోంది. వివరాల్లోకి వెళితే.... పట్టణంలోని బోయగేరికి చెందిన సరోజమ్మకు గురువారం తలనొప్పి, కడుపు నొప్పి రావడంతో ఓ ఆర్ఎంపీ వద్దకు వెళ్లగా మందులు, ఇంజెక్షన్ ఇచ్చాడు. ఇంటికి వెళ్లే లోగానే కళ్లు తిరిగి, కూర్చుండిపోయింది. కుటుంబ ఆదోనిలోని ఆదిత్య నర్సింగ్ హోంకు తరలించారు. అక్కడి వైద్యుడు శ్రీనివాసరావు పరీక్షించి, పల్స్ పడిపోయి, మెదడులో సమస్య ఏర్పడిందని ఆర్ఎంపీ వేసిన ఇంజక్షన్ వల్లే ఇలా అయిందని భర్త వీరాంజికి వివరించాడు. ఆదిత్య నర్సింగ్ హోమ్ వైద్యుడు శ్రీనివాసరావును వివరణ కోరగా మహిళ పరిస్థితి సీరియస్‌గా ఉందని, భర్త తెలిపిన మేరకు ఆర్ఎంపీ మోనోసెఫ్ మందును నరాల్లోకి ఎక్కించడంతో మెదడులోని కణాలు దెబ్బతిన్నాయని, ఆమె మెదడు స్పందించే దానిపై చికిత్స ఆధారపడుతుందన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆదోని, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ పోలీస్, సివిల్ పోలీసులతో కలిసి ఆదోనిలోని అపిసారాళ్ల కొండల్లోని సారా స్థావరాలపై శనివారం దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్లా తెలిపారు. వాల్మీకి నగర్‌కు చెందిన బోయ వెంకటేష్, ప్రశాంత్‌నగర్‌కు చెందిన బోయ గుంటిమ్మను అరెస్టు చేసి 5 లీటర్ల సారాను సీజ్ చేశామని తెలిపారు.

పట్టుబడ్డ వాహనాల వేలం


ఎస్ఐ మహేష్ కుమార్

ఆదోని రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఆదివారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు. శనివారం మాట్లాడుతూ స్టేషన్‌లో 11 ద్విచక్ర వాహనాలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు ఉదయం 10 గంటల్లోపు గుర్తింపు కార్డుతో పోలీస్ స్టేషన్‌కు రావాలన్నారు.

వర్గాలను ప్రోత్సహిస్తున్న కో ఆర్డినేటర్



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

● పూల నాగరాజుపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తా
● ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పూల నాగరాజు వర్గ విబేధాలను ప్రోత్సహిస్తున్నారని ఆయన తీరుపై పార్టీ అధినాయకత్వానికి ఫిర్యాదు చేస్తానని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ తెలిపారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. 'అన్నదాత సుఖీభవ' ట్రాక్టర్ ర్యాలీలో పార్టీ పరిశీలకుడు అందరినీ సమన్వయం చేసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు. పార్టీ కోసం కష్టపడుతున్న, ఇన్‌చార్జిగా ఉన్న తనను కాదనడం సరికాదన్నారు. తాను ఇన్‌చార్జి కాకుంటే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల మంజూరులో ఇన్‌చార్జి అని తన పేరుపై ప్రభుత్వం ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. అధినాయకత్వం తనను పని చేయమంటే చేస్తానని, పక్కన ఉండమంటే ఉంటానని తెలిపారు. పోలీసులు ఒకే వర్గానికి మద్దతు ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కిష్టప్ప, అశోక్, తిమ్మయ్య, సర్పంచ్ నాగరాజు, రాము యాదవ్, వన్నూరువలి, కేశన్న, అంజి, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళల అభివృద్ధి

తుగ్గలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలో మహిళలు అభివృద్ధి చెందుతారని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. శనివారం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించాన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చన్నారు. చంద్రశేఖర్ యాదవ్, వెంకటస్వామి, బర్మా వీరేష్ ఉన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు తుగ్గలి నాగేంద్ర

పూర్వ విద్యార్థుల కలయిక

ఆలూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పట్టంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. 25 సంవత్సరాల తర్వాత తాము చదివిన పాఠశాలలో కలియ తిరిగి అలనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వివిధ స్థాయిలో స్థిరపడిన తమ సహ విద్యార్థులను ఆలింగనం చేసుకున్నారు. ఉపాధ్యాయులు శంకర్‌రెడ్డి, రమణయ్య, పవన్‌కుమార్, రుక్మిణిని సన్మానించారు. ఏటా పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించాలని నిర్ణయం తీసుకున్నారు.


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి



గోడపత్రిక విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

మంత్రాలయం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాల హామీలను అమలు చేసే విధానం వేగాన్ని పెంచాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్‌డిమాండ్ చేశారు. శనివారం పరమాన్‌దొడ్డి తాండా సీపీఐ కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో ఒంగోలులో జరిగే ప్రజావ్యతిరేక విధానాల పై ఛలో ఒంగోలు గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. నిరుద్యోగ భృతి, నిరుపేదలకు మూడు సెంట్ల స్థలం పథకాలు ఇంకా అమలు కాలేదన్నారు. వీటన్నింటిపై ఈ నెల 20 నుంచి 25 వరకు ఒంగోలు లో సభలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఈరన్న, సునీల్, మక్బుల్ బాషా, రమేష్ నాయక్, మల్లి, రాము, శంకర్ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు తప్పనిసరి : డీఎం



మాట్లాడుతున్న డిపో మెనేజర్ మద్దిలేటి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసి బస్సులలో ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం గుర్తించినటువంటి గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని డిపో మెనేజర్ మద్దిలేటి నాయుడు పేర్కొన్నారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్‌లు, పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్‌ల సర్వీసులలో ఉచితంగా ప్రయాణం చెయవచ్చును అని తెలిపారు. ఉచిత ప్రయాణానికి తమ గుర్తింపు కార్డులు ఆధార్, రేషన్, ఓటర్ కార్డు, కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఎధైనా ఆంధ్ర రాష్ట్ర చిరునామా కలిగిన గుర్తింపు ఒరిజినల్ కార్డు కండక్టరుకు చూపించి పైన తెలిపిన బస్సులలో జీరో టికెట్‌ను పొంది ఉచిత ప్రయాణం చెయవచ్చును అన్నారు. ఈ సందర్భంగా అంతరాష్ట్ర సర్వీసులకు ఈ పథకం వర్తించదు అని ప్రకటనలో తెలిపారు. ఎమ్మిగనూరు డిపో నుంచి అంతరాష్ట్ర సర్వీసులు బెంగళూరు, అయిజ, బళ్ళారి సర్వీసులకు ప్రతి ఒక్కరు టికెట్ తీసుకోవాలన్నారు.

తుంగతీర గ్రామాలకు యూరియా పంపిణీ



యూరియా పంపిణీ చేస్తున్న నాయకులు, ఏఈవో

నందవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర తీర గ్రామాలైన పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, సజీవపురం, జోహరాపురం, గురుజాల, రాయచోటి, గ్రామాల రైతులకు టీడీపీ మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీ శనివారం 560 సంచులు యూరియా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు తుంగభద్ర తీర గ్రామాలకు వెంటనే యూరియా పంపిణీ చేయాలని అధికారులను ఎమ్మెల్యే అదేశించారని వ్యవసాయ విస్తరణ అధికారి రాఘవేంద్రతో కలసి యూరియా పంపిణీ చేశారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూస్తామని కాశీంవలీ హామీ ఇచ్చారు. పార్టీలకతీతంగా ప్రతి రైతుకు యూరియా అందజేస్తామన్నారు. పెద్దకొత్తిలి ఆదిశేషు, నదికైరవాడి వీరేష్, సోమన్న, నాగేంద్రప్ప, శివారెడ్డి, రామకృష్ణరెడ్డి, ఈరన్న పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- వాడవాడలా కృష్ణుని వేషధారణలో మురిపించిన చిన్నారులు
- ఉట్టి కొట్టి సంబరాలు చేసుకున్న యువత
- అన్ని దేవాలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు



శ్రీమఠం మహా ముఖద్వారం ఎదుట ఉట్టి కొడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



ఎమ్మిగనూరులో పూజలు అందుకుంటున్న గీతా మందిర్‌లోని కృష్ణుడు



గోనెగండ్లలో శ్రీకృష్ణ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మంత్రాలయం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ముఖద్వారం ముందు శ్రీకృష్ణా జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శనివారం శ్రీమఠం అధికారులు, ఉద్యోగులు, గురుసార్వభౌమ సంస్కృత వేద పాఠశాల విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తన స్వహస్తాలతో ఉట్టి కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళ్లకు గంతలు కట్టి రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా సంబరాలు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులకు పీఠాధిపతి ఆశిస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, రాజా ఎస్ అప్రమేయాచార్, ప్రకాషాచార్, ద్వారపాలక అనంతస్వామి, వాఘేంద్రాచార్‌లు పాల్గొన్నారు.

● **గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు:** మంత్రాలయంతో పాటు మాదవరం, చెట్నహల్లి, చిలకలడోన, మాలపల్లి, రచ్చుమర్రి, వగరూరు తదితర గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకల సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుని, గోపికల వేషధారణలతో స్వామివారికి పూజలు, చేసి కోలాటాలు చేసి పల్లకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు పట్టణంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని యాదవసంఘం ఆధ్వర్యంలో స్థానిక తాయమ్మ అవ్వగుడి దగ్గర ఉన్న యాదవసంఘం కార్యాలయంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకృష్ణుని చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై అధిష్టించి పట్టణ ప్రధానరహదారుల గుండా మేళతాలాళలో ఊరేగించారు. అలాగే తేరుబజారులో ఉట్టి కొట్టి కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. యువకులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని ఉట్టికొట్టారు. కార్యక్రమంలో సంఘం తాలుక అధ్యక్షుడు నారాయణ, నాయకులు మధవస్వామి, భీమన్న, తిప్పన్న, శేషు, నారాయణ, వీరేష్, వెంకటేశ్, రాజేష్, లక్ష్మీనారాయణ, రాముడు, శేఖర్, హనుంతు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

● ఎమ్మిగనూరు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. కడిమెట్ల, కడివెళ్ల, కందనాతి, పార్లపలి, దైవందిన్నె, వెంకటగిరి, శీరాలదొడ్డి, దేవిబెట్ట, కోటేకల్, బనవాసి, బోడబండ, చెన్నాపురంతో పాటు ఆయాగ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధల మధ్య జరుపుకున్నారు. మండలపరిధిలోని సీరాలదొడ్డి గ్రామంలో చిన్నారి శ్రీకృష్ణుని వేశంతో అలరించింది.

గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్ల తోపాటు మండల పరిధిలోని పెద్దనేలటూరు ఎన్నెకండ్లలోతోపాటు పలు గ్రామాల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణ జన్మదినం సందర్భంగా గోనెగండ్లలో ఉదయం స్వామివారికి తుంగభద్ర జలయంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం తులసీ అర్చన, నవగ్రహపూజ, క్షీరాభిషేకం, మహామంగళహారతి నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమం అఖిల భారత యాదవ సంఘం మండల నాయకులు లక్ష్మీనారాయణయాదవ్, రంగస్వామియదవ్, పెద్దఈరన్నయాదవ్, నాగన్నయాదవ్ ,రాముడుయాదవ్, మాజీ ఎంపీటీసీ కృష్ణ, ఎర్రన్న, లక్ష్మన్న, రంగన్న,వీరకృష్ణ, శివ, రామన్న, లింగన్న, పాల్గొన్నారు. ఎన్నెకండ్లలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని గీతా మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శనివారం గీతామందిర్‌లో గీతా జ్ఞాన సేవాసమితి అధ్యక్షుడు లక్ష్మన్న, కార్యదర్శి ఉరుకుందప్పలు మాట్లాడుతూ లోకకళ్యాణార్థం 18 రోజులుగా శ్రోతియ బ్రహ్మవిష్ణులు, కామవరం శ్రీ గురు శివరామ అవధూత అశ్ర మ అధ్యక్షులు శ్రీ అవ్యక్తానంద సరస్వతీ స్వాముల వారిచే దంపతులతో గీతాయజ్ఞ హోమాలు ,పూజలు ఘనంగా నిర్వహించామన్నారు. అనంతరం చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలతో ఉటికొట్టే కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు. అనంతరం శ్రీ కృష్ణ ఉత్సవ విగ్రహాలను రథంపై అలంకరించి, భాజా భజంత్రీలతో పురవీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి, పెద్దారెడ్డి, నాగరాజు, హంపయ్య తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రమైన కోసిగిలోని గీతా మందిరంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు శ్రీకృష్ణుడు, రాధ, గోపికమ్మల వేషాధారణలు వేసి పండుగను జరుపుకున్నారు.

మంత్రాలయంలో రథోత్సవాలు బంద్



అలంకరణ లేని స్వామివారి నిజ బృందావనం

మంత్రాలయం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా మధ్వ సాంప్రదాయ ప్రకారం బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, పరిమళ ప్రసాదం, టెంకాయ కొట్టడం బంద్ చేశారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి నిర్మల విసర్జనం, నిర్వహించి పూర్ణబోద పూజమందిరంలో మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇచ్చారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనానికి భక్తులు దర్శించుకున్నారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, పండితులు, అర్చకులు, శ్రీమఠం ఉద్యోగులు ఉపవాసం పాటించారు

భక్తులతో మార్మోగిన మంత్రాలయం : ప్రముఖపుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో శ్రీమఠం మార్మోగింది.శుక్ర, శని, ఆదివారం వరుసగా సెలవు దినాలు కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహరాష్ట్ర తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల సంఖ్య.. పెరుగుతూ వచ్చింది. తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి రాఘవేంద్ర స్వామి నిజ మూల బృందావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో అధికారుల ఏర్పాట్లు చేశారు. రథోత్సవాలు, టెంకాయ కొట్టడం, పరిమళ ప్రసాదం లేకపోవడంతో భక్తులు నిరుత్సానికి గురయ్యారు. భక్తుల రద్దీనీ ఆసరాగా చేసుకున్న హోటళ్ల యజమానులు రేట్లు పెంచేశారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అసౌకార్యనికి గురయ్యారు.

పాఠశాలలకు కంప్యూటర్ల అందజేత

కౌతాళం, ఆగస్టు 16(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఏడు స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలలకు శనివారం ఆయా పాఠశాలల ప్రధానోపా ధ్యాయులకు కంప్యూటర్లను అందజేసినట్లు కౌతాళం మండల విద్యాధికారిణి శోభారాణి తెలిపారు. మండల కేంద్రము కౌతాళంతో పాటు ఉరుకుంద, హల్వి, ఎరిగేరి, బదినేహల్, బాపురం, నదిచాగి ఉన్నత పాఠశాలలకు ఈ కంప్యూటర్లు మంజూరైనట్లు తెలిపారు. వీటిని ప్రధానోపా ధ్యాయులకు ఎమ్మార్సీ భవనంలో అందజేసినట్లు తెలిపారు.



ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనది



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎస్టీయూ సభ్యులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని విలువలతో కూడినదని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక మాచాని సోమప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన పదవీ విరమణోత్సవంలో వారు మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన వెంకటేశ్వరరెడ్డి, శివరామ, దేవకృష్ణమ్మలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు నాగరాజు, బసవరాజు, ప్రసన్నరాజు, శేఖర్ పాల్గొన్నారు.

పల్లకోత్సవాన్ని విజయవంతం చేద్దాం



వెండి చెంబులను అందజేస్తున్న మాజీ చైర్మన్ చెన్నబసప్ప కుటుంబ సభ్యులు

కౌతాళం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ద పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న శ్రావణ మాసపు ఉత్సవాలలో ముఖ్య ఘట్టమైన స్వామి వారి పల్లకి ఉత్సవాన్ని 'అందరం కలిసి విజయవంతం చేద్దామ'ని ఆలయ ఈఓ వాణి కోరారు. ఉత్సవ నిర్వహణపై గ్రామ పెద్దలు, ఆలయ వైదిక కమిటీ సభ్యులతో దేవాలయ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

స్వామి వారికి విరాళాల అందజేత

స్వామి వారికి భక్తులు శ్రావణ మాసంలో భాగంగా శనివారం రోజు భక్తులు విరాళాలు అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్, ఈఓ వాణి తెలిపారు. ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ చెన్నబసప్ప కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి 1.2కిలోల నాలుగు వెండి చెంబులను విరాళంగా అందజేసినట్లు తెలిపారు. వీటి విలువ రూ.1,35,000లు ఉంటుందన్నారు. దేవాలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆదోని పట్టణానికి చెందిన అక్షర స్కూల్ యాజమాన్యం వారు రూ.1,00,000ల నగదును ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆలయ కార్యాలయం నందు అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఈఓ వాణి స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి పూలమాల శాలువాలతో సన్మానించి స్వామి వారి లడ్డు ప్రసాదాలను అందజేశారు.

బీజేపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పరమహంస

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు వార్డుల నుంచి యువత భారీగా బీజేపీలో చేరినట్లు జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ పరమహంస తెలిపారు. శనివారం స్థానిక హెచ్‌బీఎస్ కాలనీలో నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా కార్యదర్శి దయాసాగర్, గురురాజ్ దేశాయ్, లలిత్ జైన్‌లు మాట్లాడుతూ బీజేపి పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, నరేంద్ర మోడీ అభివృద్ధి నచ్చి 14, 18, 21, 23వ వార్డుల నుంచి 100 మంది యువత చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, భాస్కర్, సుధాకర్ గౌడ్, బషీరెడ్డి, బడెసాబ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యేను కలిసిన ఎంబీ చర్చి పెద్దలు



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ఎంబీ చర్చి సంఘ పెద్దలు

ఎమ్మిగనూరు,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలుగొట్ల రోడ్డులో ఉన్న ఎంబీ చర్చి సంఘపెద్దలు శనివారం సభ్యులు కదిరికోట శాలేం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా చర్చి నుంచి గౌస్ హోటల్ వరకు సీసీ రోడ్డు వేయటంపై కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎస్సీ శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మించాలని, చర్చి వెనుక ఖాళీస్థలం చర్చికి చెందేలా చర్యలు తీసుకోవాలని, ఎస్సీకాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. చర్చి సంఘం కార్యదర్శి భాస్కర్‌బాబు, సహాయ కార్యదర్శి తిమ్మరాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళా ప్రయాణికులతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్సులు



బస్సు ఎక్కేందుకు గుమికూడిన మహిళా ప్రయాణికులు

ఎమ్మిగనూరు ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీమేరకు స్త్రీశక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచితప్రయాణాన్ని ప్రారంభించింది. దీంతో మహిళా ప్రయాణికులతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసాయి. ఆదోని, గూడూరు, బెళగల్, మంత్రాలయం, ఉరుకుంద ప్రాంతాలకు వెళ్లే బస్సులు మహిళా ప్రయాణికులతో రద్దీగా కనిపించాయి. ఉచిత ప్రయాణం కావటంతో మహిళలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకాలం ఎక్కిడికైన వెళ్లాలంటే చార్జీల భారంతో ఇబ్బంది పడేవాళ్లం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీ బస్సుల్లో ఉచితప్రయాణాన్ని కల్పించి ఆ భారాన్ని తొలగించటంతో మహిళల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

'స్త్రీ శక్తి' మహిళలకు వరం : టీడీపీ

నందవరం, ఆగస్టు 16(ఆంధ్యజ్యోతి): స్త్రీ శక్తి పథకం మహిళలకు వరంటాంటిదని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈరన్నగౌడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాదవరావు అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు ఎంతో ఉపయోగకరం అన్నారు. 5 రకాల ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం హర్షనీయమన్నారు. సూపర్ సిక్స్ పథకాలు దశల వారిగా నెరవేర్చుతుంటే వైసీపీ నాయకులకు మింగుడు పడడంలేదన్నారు. టీవీ రాష్ట్ర మంత్రులు, కేంద్రమంత్రులతో కలసి మాట్లాడి నిధులు తీసుకు వచ్చి అభివృద్ధి చేస్తున్నారని గుర్తు చేశారు. వైసీపీ నాయకులు న్యూఢిల్లీ మొహం కూడా చూడలేదని ఎద్దేవ చేశారు.

కాలువ శుభ్రం చేసిన రైతులు



కాలువను శుభ్రపరుస్తున్న దృశ్యం

నందవరం, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): గురురాఘవేంద్ర ప్రాజెక్టు కింద కాలువను మాచాపురం రైతులు శుభ్రం చేసుకుంటున్నారు. జీఆర్‌పీ నుంచి కింద కాలువ వరకు ముళ్ల కంపలు నిండి పోయి ఉండి కింద పంట పోలాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయో పరిస్థితి ఉండడంతో సూమారు రెండు కిలోమీటర్ల మేర మండల పార్టీ కన్వీనర్ కాశీంవలి తన సొంత ఖర్చులతో శుభ్రం చేయిస్తుండగా, రైతులు కూడా తమ తమ పొలాల వద్ద కాలువలోని ముళ్ల కంపలను తొలగిస్తున్నారు. కార్యక్రమంలో మాచాపురం టీడీపీ నాయకులు వలీ, రంజాన్, సుధాకర్‌రెడ్డి, వసంత్, మహ్మద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.